

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.140	194	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 17.0

• వైభవంగా దిష్టిపూజ



సూర్యాపేట జిల్లా కేసారం నుంచి సౌడమ్మ దేవరపెట్టెను పెద్దగట్టుకు తరలిస్తున్న యాదవులు

• అట్టహాసంగా నగరోత్సవం



•5లో..

చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లగొండలో నగరోత్సవంలో మహిళల కోలాటం

ప్రేమ పెళ్లిళ్లపై పరువు కత్తి

» అడ్డుపడుతున్న కులం, మతం, ఆర్థిక స్థోమతలు
» అంగీకరించని తల్లిదండ్రులు
» కక్ష పెంచుకొని హత మారుస్తున్న వైనం
» ఆందోళన కలిగిస్తున్న పరువు హత్యలు



ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీతో పరుగులు పెడుతున్నా సమాజంలోని కుల, మత, ఆర్థిక అంతరాలు మాత్రం తొలగడం లేదు. యువతీ యువకుల మధ్య చిగురిస్తున్న ప్రేమలకు ఇవి అడ్డుగోడగా నిలుస్తున్నాయి. పరువు పేరుతో ప్రేమ వివాహాలను పెద్దలు అంగీకరించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం రెండు నుంచి మూడు జంటలు ప్రేమ వివాహాలు చేసుకుంటుండగా, వీటిలో పెద్దలు అంగీకరించినవి కొన్నే ఉంటున్నాయి. అంతేగాక ప్రేమ పేరుతో కూతురిని దూరం చేశారని, సమాజంలో పరువు తీశారని తల్లిదండ్రులు కక్ష పెంచుకుంటున్నారు. ఫలితంగా పరువు హత్యలు చోటుచేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సూర్యాపేట జిల్లాలో జరిగిన ఓ యువకుడి పరువు హత్య దీనికి నిదర్శనం.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పరువు హత్యలు కొనసాగుతున్నాయి. కుమార్తె, కుమారుడు ఇష్టం లేకుండా ప్రేమ, కులాంతర వివాహం చేసుకోవడం కొంత మంది తల్లిదండ్రులకు ఇష్టం ఉండడం లేదు. వారి సామాజికవర్గంలో వివాహం చేయాలని ఆశించిన వారికి ప్రేమ వివాహాలు రుచించడం లేదు. దీంతో కోపోద్రుక్తులై ప్రేమ వివాహం చేసుకున్న వారిని అంతమొందిస్తున్నారు. మాయ మాటలు చెప్పిన యువకుడి అంతమొందిస్తే తర్వాత కుమార్తె యథావిధిగా ఇంటికి వస్తుందని వారు భావిస్తున్నారు. కొన్నాళ్ల పాటు ఘటనను మర్చిపోయగా, వారిని ఇష్టమొచ్చిన వారికి కట్టబెడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో సూర్యాపేటలో 2000లో కులాంతర వివాహం చేసుకుందని ఓ వ్యాపారి యువకుడిని హత్య చేయించాడు. 2012లో తన కుమార్తెను ప్రేమిస్తున్నాడని ఎంత చెప్పినా వినడంలేదని భావించిన వ్యక్తులు ప్రేమికుడిని హత్య చేశారు. అదే విధంగా యాదాద్రి జిల్లాలో నాలుగేళ్ల క్రితం లింగరాజుపల్లికి చెందిన తుమ్మల స్వాతి, పల్లెర్ల గ్రామానికి చెందిన నరేష్ ప్రేమించుకున్నారు. వారి ప్రేమకు కులాలు అడ్డుకావడంతో తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో స్వాతి తల్లిదండ్రులు నరేష్‌ను హత్య చేశారు. అది తట్టుకోలేక స్వాతి కూడా మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే విధంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గానుగవెల్లికి చెందిన యువకుడు పీఏపల్లి మండలం పోల్కంపల్లికి చెందిన యువతిని ప్రేమించాడు. వాళ్లిద్దరు ప్రేమ వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న యువతి తండ్రి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో పోలీసులు యువకుడి మందలించడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనను మరవకముందే మిర్యాలగూడెంలో ప్రేమ పేరుతో కులాంతర వివాహం చేసుకుందనే పగతో వ్యాపారి మారుతీరావు తన కుమార్తె అమృతను ప్రేమ వివాహం చేసుకున్న దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రణయ్‌ను హత్య చేయించాడు. తాజాగా, సూర్యాపేటలో ఓ యువకుడు పరువు హత్యకు గురయ్యాడు.

ప్రేమిస్తే విభేదిస్తున్న తల్లిదండ్రులు

మేజర్ అయిన యువతీ, యువకులు ఒకరినొకరు అర్థం చేసుకొని కలకాలం కలిసి జీవించేందుకు ప్రేమించుకుంటున్నారు. ప్రేమ అనంతరం ఒకటవుతున్నారు. కానీ, వీరి ప్రేమను తల్లిదండ్రులు విభేదిస్తున్నారు. ప్రేమలు కేవలం వ్యామోహం, ఆకర్షణలని తిరస్కరిస్తున్నారు. ప్రేమ పేరుతో వివాహాలు చేసుకున్న వారు జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన సందర్భాలు తక్కువగా ఉంటున్నాయని కొంత మంది తల్లిదండ్రులు ప్రేమ వివాహాలను అంగీకరించడం లేదు. ప్రేమ వివాహం చేసుకుంటే చస్తామని మరి కొంత మంది తల్లిదండ్రులు బెదిరిస్తున్నారు.

పగ పెంచుకొని..

పిల్లల ప్రేమను జీర్ణించుకోలేని కొంత మంది పగతో రగిలిపోతున్నారు. ఇలాంటి తరుణంలోనే వారిని హతమార్చేందుకు వెనకాడడం లేదు. పలు సందర్భాల్లో ఇద్దరు ప్రేమికులను కూడా చంపేస్తున్నారు. కుమార్తెకు మాయమాటలు చెప్పి లొంగదీసుకొని సమాజంలో తలదించుకునేలా ప్రవర్తించాడని యువకులపై కోపం పెంచుకుంటున్నారు. దీంతో హత్యలు జరుగుతున్నాయి. తాజాగా, సూర్యాపేట మునిసిపాలిటీ...


- మిగతా 4వ పేజీలో...





అడ్డుపడుతున్న కులాలు, ఆర్థిక స్థోమతలు

ప్రేమ వివాహాలకు కులాలు, ఆర్థిక స్థోమతలు అడ్డుపడుతున్నాయి. తక్కువ, ఎక్కువ కులం అంటూ ప్రేమ వివాహాలకు పెద్దలు అంగీకరించడంలేదు. సమాజంలో పరువు పోతుందని కొంత మంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఆర్థిక స్థోమతలు కూడా అడ్డుపడుతున్నాయి. తమ స్థాయికి తగ్గ కుటుంబం కాదని విభేదిస్తున్నారు. ఇలాంటి తరుణంలోనే ప్రేమ వివాహాలు చేసుకున్న యువతీ, యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా నివాసం ఉండి జీవించలేక దూర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు.



పంటల బీమా ఏదీ?

» ఇంకా విధివిధానాలు రూపొందించని ప్రభుత్వం » బీమా కంపెనీలతో చర్చలతోనే సరి
» పంటలు దెబ్బతింటే పరిహారం దక్కని పరిస్థితి » ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటల సాగు

నల్లగొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకంపై ఒక నిర్ణయానికి రాలేక పోతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు పంటల బీమాపై విధివిధానాలను ఖరారు చేయలేదు. గత వానాకాలం సీజన్ నుంచే పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించినా, యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇది అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ సీజన్‌లో పథకం అమలు లేనట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఎంఎఫ్‌బీవైలో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఏడాదిగా ఈ పథకం అమలుకు విధి విధానాలు రూపొందించాలని ఆర్థిక...

- మిగతా 4వ పేజీలో...



బీమా కంపెనీలతో చర్చలతోనే సరి

ఉచిత పంటల బీమా పథకం అమలు కోసం బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణ కోసం రాష్ట్ర స్థాయిలో అధికారులు చర్చలతోనే సరిపెట్టారు. వ్యవసాయశాఖ ద్వారా చేపట్టే క్రాఫ్ బుకింగ్ యాప్‌లో పంటల వివరాలు నమోదయితే నష్టం జరిగినప్పుడు ఆ పంటలకు పరిహారం వస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 21.50లక్షల ఎకరాలల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పెద్ద మొత్తంలో వరి సేద్యమవుతుంది. డిండి ప్రాజెక్టుతో పాటు ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టు, యాదాద్రి జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతం వెంట వరి సేద్యమే అధికంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మెట్ట ప్రాంతాలల్లో రైతులు అత్యధికంగా పత్తికే ప్రాధాన్యం ఇస్తారు. ఎంత సాగు అయితే అంతా మేర పంటల బీమా పథకం అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని మెరుగైన విధంగా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లా వారీగా చర్చలు జరిగినా, సదస్సులు మాత్రం నిర్వహించలేదు. ఏఈఓల నుంచి మొదలు ఏవోఏలు, ఏడీఏలు, డీఏవోలు, సీపీవోలు ఇతర అనుబంధ శాఖల అధికారులతో సదస్సులు నిర్వహిస్తామని గతంలో ప్రకటించినా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు నిధులు కేటాయించలేదని, దీనికి బాధ్యతగా బీజేపీ మంత్రులు, ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణకు గుండుసున్నా దక్కిందన్నారు. రాష్ట్రంనుంచి బీజేపీకి ఉన్న ఇద్దరు మంత్రులు, 8మంది ఎమ్మెల్యేలు దీనికి పూర్తి బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్ డ్రీమ్ బడ్జెట్ కాదు దివాలా బడ్జెట్ అన్నారు. కేంద్రానిది ప్రజావ్యతిరేఖ బడ్జెట్ అని అది కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరేదిగా ఉందన్నారు. మధ్యతరగతి ప్రజలకు నష్టం వాటిల్లే బడ్జెట్ అన్నారు. రాష్ట్ర విభజన చట్టానికి తూట్లు పొడిచారన్నారు. దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో అన్ని సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు నిల్

(ఆంధ్రజ్యోతి, హాలియా): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక కర్షకుకు నిల్‌గా, కార్పొరేట్ సంస్థలకు ఫుల్‌గా కేటాయించి పేద బడుగు బలహీన వర్గాల పొట్టలు కొట్టి బడాబాబులకు కొమ్ముకాసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంపై 50శాతం మంది ఆధారపడి జీవిస్తుంటే కేవలం 2శాతం నిధులు మాత్రమే కేటాయించారని, కార్పొరేట్ సంస్థలకు మాత్రం 13లక్షల కోట్ల రూపాయలు రాయితీలు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యానికి కూడా నామమాత్రంగా కేటాయించారని, ధరల పెరుగుదలపై నియంత్రణ, నిరుద్యోగం తదితర అంశాలపై కేటాయింపులే లేవని అన్నారు. కార్యక్రమంలో కూన్‌రెడ్డి నాగిరెడ్డి, అవుతా సైదులు, పొదిల వెంకన్న, రెబెల్లి వెంకటేశ్వర్లు, కారంపొడి ధనమ్మ, రమేష్ పాల్గొన్నారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత

» ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు » 900మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు » ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు జడల రామలింగేశ్వర స్వామి బ్రహోత్సవాలకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే బ్రహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నామన్నారు. బ్రహోత్సవాలకు రాష్ట్రంతోపాటు, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో ముందస్తుగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 93 మంది ఎస్ఐలు, 186 మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 900మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బ్రహోత్సవాలకు వచ్చే భక్తులకు పార్కింగ్‌తో పాటు రక్షణ, భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు రోడ్డు పక్కన వాహనాలు నిలిపి భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని, వారికి కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. బ్రహోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో దొంగతనాలను నివారించే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, భక్తులు కూడా దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది కలిగినా వెంటనే పోలీస్ కంట్రోల్‌రూం, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

130 సీసీ కెమెరాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల సందర్భంగా 130 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాంరెడ్డి సూచనలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఇప్పటికే ఎస్పీ పవార్ గుట్టను సందర్శించి బందోబస్తుపై దిశానిర్దేశం చేశారని చెప్పారు. గుట్టపై స్థలాభావం ఉన్నందున ఘాట్‌రోడ్డుపై వాహనాలను అనుమతించేది లేదన్నారు. ఘాట్‌రోడ్డుపై కాలినడకన లేదా మెట్ల మార్గం ద్వారా భక్తులు గుట్టపైకి చేరుకోవచ్చన్నారు. కాలినడకన వెళ్లలేని భక్తులు దేవస్థానం, పోలీస్‌శాఖ ఏర్పాటు చేసే వాహనాల్లో వెళ్లాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌ల గస్తీతో పాటు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేవస్థానం ఆధ్వర్యంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, జాతర కోసం అదనంగా మరో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవో కార్యాలయంలో ఉండే కమాండ్ కంట్రోల్ ద్వారా వీటిని పర్యవేక్షిస్తామని తెలిపారు. మఫ్టీ సిబ్బంది నిఘా ఉంటుందన్నారు.

గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగాలని, అందుకు వారికి తగిన శిక్షణ ఇవ్వాలని అర్జున అవార్డు గ్రహీత, జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ అన్నారు. నల్లగొండకు చెందిన క్రీడాకారులు ఆదివారం గోపిచంద్‌ను హైదరాబాద్‌లోని ఆయన అకాడమిలో కలిశారు. ఖేలో ఇండియా టోర్నమెంట్‌లో అండర్-13, 15 విభాగంలో సిల్వర్ మెడల్, సీఎం కప్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతర సాధనతోనే గెలుపు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, శిక్షకుడు బండ్ల ప్రశాంశాత్‌బాబు, ఎల్లయ్య, కోచ్‌లు దాసు, సునిత, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న గోపిచంద్

బెస్తల్లో రాజకీయ చైతన్యం పెరగాలి



కేక్ కట్‌చేస్తున్న తెలంగాణ బెస్త సేవా సంఘం నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బెస్తలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని తెలంగాణ బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, వ్యవస్థాపకుడు, కవి అంబటి వెంకన్న అన్నారు. తెలంగాణ బెస్త సేవా సంఘం ఆవిర్భావం సందర్భంగా పట్టణంలోని శ్రీనగర్ గంగపుత్ర సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బెస్తలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, మత్స్య సొసైటీల్లో ఇతర కులస్థులకు చోటు ఇవ్వడం సమస్యలకు దారితీస్తోందన్నారు. రాష్ట్ర సాధనలో బెస్తలు కీలకపాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. పాఠ్యపుస్తకాల్లో చేపలు పట్టేవారు ముదిరాజ్‌లు అని తప్పుగా రాస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తూ దుర్మార్గ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. చేపలు పట్టే వృత్తి కేవలం బెస్తలదేనని, ఇతరులు కేవలం వ్యాపారం చేస్తున్నారన్నారు. తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మెట్టు సాయికుమార్ అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబటి మురళీధర్, పూర్ణచందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నామం.. వినూత్నం

•4లో..

నామం.. వినూత్నం

పుట్టిన ప్రదేశాలు.. ప్రాంతాలు పేర్లుగా

జీవితంలో పేరు తెచ్చుకోవాలిరా అంటుంటారు పెద్దలు. ఉన్నతంగా ఎదిగి అందరూ గుర్తుంచుకునేలా ఎదగాలని ఆశిస్తుంటారు. కానీ కొందరి పేర్లు వారికి ప్రత్యేక గుర్తింపు తెస్తాయి. సామాన్య జనబాహుళ్యంలో ఉండే చాలా మంది పేర్లను పెద్దగా గుర్తుంచుకోరు. కానీ వీరి పేర్లు చెబితే ఆ ప్రాంత వాసులంతా గుర్తుంచుకుంటారు. అలాంటి వినూత్నమైన ప్రత్యేక పేర్లు కలిగి న పలువురి పేర్ల వెనక కథాకమామిషు తెలుసుకుందాం.

కరెంటురావు.. డిపార్ట్‌మెంట్ పేరునే కుమారుడికి



నల్లగొండ టౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ లైన్ ఇన్‌స్పెక్టర్ పీ నర్సింహులుకు ఆయన పనిచేసే విద్యుత్ శాఖ అంటే ఎంతో అభిమానం. మొదటి నుంచి నాస్తికుడు. తనను, తన కుటుంబానికి మూడు పూటలా అన్నం పెడుతున్న కరెంటు ఆఫీసునే దైవంలా భావించేవాడు. అందుకే ఆయన తన కుమారుడికి కరెంటురావుగా నామకరణం చేశాడు. తండ్రి పెట్టిన పేరుకు కరెంట్‌రావు సార్థకత చేకూర్చాడు. విద్యుత్ శాఖలోనే ఉద్యోగం సాధించి, విద్యుత్ కార్మిక సంఘాలలో పనిచేసి తనకు, తన పేరు కంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నాడు. ప్రస్తుతం టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంటుంది : పీ.కరెంటురావు

కరెంటు ఆఫీసులో పనిచేస్తూనే అందరితో కరెంట్‌రావుగా పిలిపించుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుంది. నాన్న పెట్టిన పేరును సార్థకత చేస్తూ ఐటీఐ పూర్తి చేసిన తర్వాత మొదటి ప్రయత్నంలోనే విద్యుత్ శాఖలో ఉద్యోగం సాధించా. అప్పటి నుంచి కరెంటు ఉద్యోగిగా ఎక్కడికి వెళ్లినా నీ పేరు ఏంటని అడిగితే కరెంటురావు అని చెబుతుంటే వినేవారంతా విస్మయానికి గురయ్యేవారు. ఏదేమైనా పనిచేస్తున్న సంస్థ పేరును సొంత పేరుగా పెట్టినందుకు మా నాన్నకు రుణపడి ఉంటా. కుమారుడిగా ఆయన పేరును నిలబెడుతూ అందరి మన్ననలు చూరగొంటున్నా.

ఆసుపత్రి పేరునే తన పేరుగా 'ఆంధ్రజ్యోతి'



కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని దొరకుంట మాజీ సర్పంచ్ పేరు ముత్తవరపు ఆంధ్రజ్యోతి. ఆమె స్వగ్రామం ఖమ్మం జిల్లా లింగాల. తల్లిదండ్రులు తుమ్మల వెంకటేశ్వర్లు, భారతిలు. కాగా వారికి ఇద్దరు కుమార్తెలు, ఆంధ్రజ్యోతి చిన్నకుమార్తె. ఆమె డిగ్రీ వరకు చదువుకుంది. తల్లిదండ్రులకు ఖమ్మం పట్టణంలోని ఆంధ్రజ్యోతి ఆసుపత్రి సేవలపై నమ్మకం. దీంతో 1980లో ఖమ్మంలోని ఆంధ్రజ్యోతి ఆసుపత్రిలో జన్మించడం వల్ల ఆమె కుటుంబసభ్యులు ఆమెకు ఆంధ్రజ్యోతి అని పేరు పెట్టారు. అదే పేరుతో పిలిచేవారు. ఆంధ్రజ్యోతి 2019 నుంచి 2024 వరకు దొరకుంట గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'కి ఎక్కడ లేని అభిమానమని తెలిపారు. ఇదిలా ఉండగా ఆంధ్రజ్యోతి ఆసుపత్రి యజమానురాలు పేరు కూడా ఆంధ్రజ్యోతి. తన పేరునే ఆమె ఆసుపత్రికి పెట్టుకున్నారు.

వేకువ వెల్లువ...



ఆంధ్రజ్యోతి-ఆలేరు రూరల్ : తమ కుమారులకు సమాజంలో లేనటువంటి పేర్లను పెట్టి స్ఫూర్తి కలిగించాలన్న ఉద్దేశ్యంతో వేకువ, వెల్లువ అని నామకరణం చేశారు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు ఆదర్శనగర్‌కు చెందిన తమ్మడి శ్రీలత పద్మారావు దంపతులు. భారత రాజ్యాంగం పీడిత ప్రజలను న్యాయం చేస్తూ చైతన్యవంతులను చేస్తోందని, ఆ ఉద్దేశ్యంతోనే దూరదృష్టితో తమ పిల్లలకు వేకువ, వెలుగు పెట్టామన్నారు. మొదటి కుమారుడు డిసెంబరు 10న జన్మించడం అదే రోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం కావడంతో వెల్లువ అని పేరుపెట్టామన్నారు. ఈ సమాజాన్ని సూర్యుడు ఉదయించకముందే నిద్రలేపేది వేకువ అని అందుకే సెప్టెంబరు 30న జన్మించిన మరో కుమారుడికి వేకువ అనే పేర్లను పెట్టామన్నారు. పేర్లు సమాజాన్ని చైతన్యవంతం చేసేవిగా ప్రేరణ కలిగించేవిగా ఉండాలన్న స్ఫూర్తితో పెట్టామన్నారు.

తండ 'బజారు'..



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందిన రాములు, వరమ్మల మూడో కుమారుడి పేరు తండ 'బజారు'. ప్రస్తుతం నార్కట్‌పల్లిలోని హెరిటేజ్ పాల ఉత్పత్తి సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. బజారు కన్నా ముందు ఇద్దరు కుమారులు, కుమార్తె పుట్టినా బతకలేదు. అనంతరం పుట్టిన కుమారుడికి నడి బజార్లో పురుడు పోసారంట. దీంతో అప్పటి నుంచి అతడిని 'బజారు'గా పిలిచారు. తల్లిదండ్రులు పెట్టిన పేరును గౌరవిస్తూ అన్ని రికార్డుల్లోనూ తన పేరు బజారుగానే పేర్కొన్నారు.

సంగం 'జీడికల్లు'..



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి గ్రామస్థుడి పేరు సంగెం జీడికల్లు. వ్యవసాయం వృత్తి. రాజకీయ నాయకుడిగా ప్రవృత్తి. అతడి తల్లిదండ్రులు సంగెం సత్తమ్మ, సత్తయ్యలు సంతానం కోసం వరంగల్ జిల్లా స్టేషన్‌ఘణపూర్ మండలం జీడికల్లు గ్రామంలోని సీతారామచంద్రస్వామి భక్తులు. స్వామి వారిని వేడుకోగానే సంతానం కలిగిందట. దీంతో స్వామి వారు వెలసిన గ్రామం పేరునే తన కుమారుడికి నామకరణం చేశారు. దీంతో అప్పటి నుంచి సంగెం జీడికల్లుగానే పిలుస్తున్నారు. అన్ని రికార్డుల్లోనూ ఇదే పేరుంటుంది.

నేపాల్ దేశస్తులు వైద్యం చేశారనే 'నేపాల్'



చౌటుప్పల్ రూరల్ : నేపాల్ అనగా నే మనకు దేశం గుర్తుకువస్తుంది. యాదాద్రిభువగిరి జిల్లా చౌటుప్ప ల్ మండలం దామెర గ్రామానికి చెందిన రైతు పేరు సాతిరి నేపా ల్(62). ఆయన తల్లిదండ్రులు సంతానం కోసం రామన్నపేటలో తెల్లవాల్ల ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో నేపాల్ జన్మించాడు. అ ఆసుపత్రి లో నేపాల్ దేశానికి చెందిన వైద్యులు వైద్యం అందించారు. నేపా ల్ వైద్యుల వైద్యంతో సంతానం కలగడంతో వారిపై అభిమానంతో నేపాల్ అని తల్లిదండ్రులు పెట్టారు. పాఠశాలలోనూ నేపాల్‌గానే నమోదు చేయించారు. కొత్త వారు నేపాల్ పేరేంటి అని ఆశ్చర్యానికి గురవుతారని ఆయన తెలిపాడు. చాలామందికి తన పేరు వెనక కథంతా చెప్పాల్సి వస్తుందని నేపాల్ తెలిపాడు. అయితే అందరిలా కాకుండా తన పేరు ప్రత్యేకంగా ఉండటం గర్వంగా ఉంటుందని తెలిపారు.

ఎన్నికల సమయంలో పుట్టాడని ఎలక్షన్ అని పెట్టారు



చండూరు రూరల్: నల్లగొండ జిల్లా చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన బురుకల బిక్షమయ్యకు నలుగురు కుమారులు ఒక కుమార్తె. 1982 సంవత్సరంలో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి ఎన్నికల బరిలో ఉన్న సమయంలో అన్నిపార్టీలు హోరాహోరీగా ప్రచారాలు నిర్వహించాయి. అదే సమయంలో 25 నవంబరు 1982న భిక్షమయ్యకు మూడో కుమారుడు జన్మించాడు. అతడికి మొదట ఆంజనేయులు పేరు పెట్టారు. అయితే డిసెంబరు ఎన్టీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక గ్రామానికి చెందిన మేక రాంరెడ్డి, బాణాల శేషారెడ్డిలు ఆంజనేయులు పేరు వద్దని ఎలక్షన్‌గా నామకరణం చేయాలని సూచించారు. దీంతో తండ్రి భిక్షమయ్య ఆంజనేయులు స్థానంలో ఎలక్షన్ పేరు పెట్టాడు. పెరిగి పెద్ద అవుతున్న సమయంలో పాఠశాలలో విద్యార్థులు తన పేరును చూసి వింతగా చూసేవారని ఎలక్షన్ తెలిపారు.

అందరూ.. స్కైలాబ్‌లే



ఆత్మకూరు(ఎం) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జక్కు సిద్ధి మల్లారెడ్డి, భారతమ్మ దంపతులకు 1979లో చిన్నకుమారుడు జన్మించాడు. అదే సంవత్సరంలో స్కైలాబ్ పడింది. దీంతో ఆ సంఘటన గుర్తుగా కుమారుడికి స్కైలాబ్‌రెడ్డిగా పేరు పెట్టుకున్నారు. చాలా సందర్భాల్లో స్కైలాబ్ పడినప్పుడు పుట్టాడంటూ అనుకోవడం విని నవ్వుకునేవాడిని అంటూ స్కైలాబ్‌రెడ్డి అన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.



భూదాన్‌పోచంపల్లి : 1979లో స్కైలాబ్ పడిన సందర్భంలోనే యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన శాపాక భిక్షపతి-నర్సమ్మలకు నాలుగో సంతానంగా కుమారుడు జన్మించాడు. దీంతో ఆ ఘటనకు గుర్తుగా స్కైలాబ్ అని పెట్టారు. తన పేరును చెబితే ఆశ్చర్యంగా మరోసారి చెప్పాలని అడుగుతారని, ఎంతో సంతోషంగా ఉంటుందని స్కైలాబ్ తెలిపారు. ప్రస్తుతం స్కైలాబ్ జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసి జీవనం సాగిస్తున్నాడు.



మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామం రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ రాగ్యానాయక్(దేవరకొండ మాజీ ఎమ్మెల్యే), భారతీభాయి(మాజీ ఎమ్మెల్సీ, విప్‌గా పనిచేశారు) దంపతులకు ఐదుగురు సంతానం. ఐదో సంతానంగా పుట్టిన కుమారుడికి స్కైలాబ్‌నాయక్‌గా నామకరణం చేశారు. అయితే నియంత్రణ కోల్పోయిన ఉపగ్రహం స్కైలాబ్ పడుతుందని 1979 జూన్ 15 నుంచి సుమారు మూడు వారాల పాటు జనంభయం భయంగా గడిపారు. రాగ్యానాయక్ దంపతుల వద్దకు తండ్రి ఎర్రానాయక్ చేరారు. స్కైలాబ్ గండం తొలిగిపోతే తన కుమారుడికి పుట్టే బిడ్డకి స్కైలాబ్ అని నామకరణం చేస్తానని కల్లేపల్లి మైసమ్మకు ఎర్రానాయక్ మొక్కుకున్నాడు. జూలై 11న స్కైలాబ్ గండం తప్పింది. ఆ క్రమంలో నెల వ్యవధిలో జన్మించిన మనుమడికి స్కైలాబ్ నాయక్‌గా నామకరణం చేశాడు తాత ఎర్రానాయక్.

అందరూ గుర్తుంచుకునేవారు: స్కైలాబ్ నాయక్

తాత ఎర్రానాయక్ మైసమ్మ మొక్కు తీర్చుకునే క్రమంలో స్కైలాబ్‌గా నామకరణం చేశారు. స్కూల్‌లో స్నేహితులు, ఉపాధ్యాయులు నాపేరును ఎక్కువగా గుర్తించేవారు. పార్టీ పెద్దలు నాపేరుతో సులభంగా గుర్తించేవారు. అందరిలో పేరు ప్రత్యేక ఆకర్షణగా వుంటుంది.

డిండిలో..



డిండి : నల్లగొండ జిల్లా డిండికి చెందిన గొడుగు లక్ష్మమ్మ, నారయ్యలకు నాలుగో సంతానం స్కైలాబ్ పడిన రాత్రి కలిగింది. దీంతో కుమారుడికి స్కైలాబ్ అని పేరుపెట్టుకున్నారు. అప్పటి నుంచి అందరూ స్కైలాబ్ అని పిలవడం మొదలైంది. మొదటగా స్కైలాబ్ పేరు కొత్తగా అనిపించినా, రాను రాను తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు ప్రేమగా పిలవడం మొదలైందని స్కైలాబ్ తెలిపారు.

ఆమనగంటి 'స్కైలా'



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి ఈమె పేరు స్కైలా. తల్లిదండ్రులు దామనూరి సంగయ్య, మారయ్యలు కాగా రామన్నపేట మండలంలోని ఎన్నారం గ్రామం. 1979లో స్కైలాబ్ పడినపుడు ఈమె పుట్టడంతో స్కైలా అని పెట్టమని గ్రామానికి చెందిన పెద్దమనిషి సూచించారట. దీంతో తల్లిదండ్రులు ఆమెకు స్కైలాగా నామకరణం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

● కంటైనర్‌ను ఢీకొట్టిన వాహనం ● నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాములలో ఘటన





వాహనంలో ఇరుక్కున్న ఆర్టీసీ ఉద్యోగులు, ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులు

కట్టంగూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న కంటైనర్‌ను వెనకాల వచ్చిన ఆర్టీసీ ప్రభుత్వ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామశివారులోని శ్రీ రాఘవేంద్ర ఫెర్రో ఎలైస్ కంపెనీ వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ ఉద్యోగులైన గరినేపల్లి నర్సింహారావు, వడ్డెబోయిన వెంకటేశ్వర్లు ఆర్టీసీ డ్రైవర్ ఉపేందర్‌తో కలిసి సూర్యాపేట నుంచి నల్లగొండకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. మార్గంమధ్యలో అయిటిపాముల గ్రామశివారులోకి రాగానే హైదరాబాద్ వైపు వెళుతున్న కంటైనర్ డ్రైవర్ సుజిత్ కుమార్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ప్రభుత్వ వాహనం కంటైనర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. అదే సమయంలో అదే వైపు నుంచి వస్తున్న గూడ్స్ ఢీకొట్టడంతో బొలేరో వాహనం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న ముగ్గురు ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో క్యాబిన్‌లో ఇరుకున్న ఉద్యోగులను పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ప్రమాదానికి గురైన వాహనాలు జాతీయ రహదారిపై ఉండటంతో హైవేపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తీవ్రగాయాలైన ముగ్గురిని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగి శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



చిన్నారి నవనీత మృతదేహం

పాలకవీడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నారి తల్లి శిరీష, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం హనుమయ్యగూడెం గ్రామానికి చెందిన బానోతు కృష్ణ టీఎస్పీ కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతనికి భార్య శిరీష, ఏడాదిన్నర ఏళ్ల కుమార్తె నవనీత ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఉద్యోగపరంగా రెండు నెలలు పోలీస్ ట్రైనింగ్ ఉండటంతో బానోతు కృష్ణ అతని భార్య, కుమార్తెను స్వగ్రామమైన హనుమయ్యగూడెంలో ఉంచి విధుల్లో చేరారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో శిరీష ఇంట్లో పని చేసుకుంటుండగా నవనీత ఆడుకుంటూ బయటకు వెళ్లింది. తల్లి శిరీష ఇంట్లో పని ముగించుకొని బయటకు వచ్చి చూసేసరికి నవనీత నీటి తొట్టిలో మునిగి ఉండటాన్ని గమనించింది. వెంటనే నవనితను నీటి తొట్టిలోనుంచి బయటకు తీసింది. పక్కంటి వారి సహాయంతో 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చిన్నారి ఎక్కువ సేపు నీటిలో మునిగి ఉండటంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు.

సదర్శాపురంలో గృహిణి ఆత్మహత్య

మోత్కూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామానికి చెందిన బోరెడ్డి రవళి (25) హైదరాబాదు ఉప్పల్‌లో శనివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సదర్శాపురం కాలంవారి బావికి చెందిన బోరెడ్డి రాజశేఖర్ రెడ్డి, అతని భార్య రవళి కొంత కాలంగా ఉప్పల్‌లో ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ తగాదాలతో రవళి ఉప్పల్‌లోనే ఉంటుండగా సుమారు యేడాది కాలంగా రాజశేఖర్‌రెడ్డి అతని స్వగ్రామమైన సదర్శాపురంలో ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరగడంతో రవళి మనస్తాపానికి గురై శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. రవళి తల్లి మలిపెద్ది రజిత ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రేమ పెళ్లిళ్లపై పరువు కత్తి

(5వపేజీ తరువాయి)

పరిధిలోని పిల్లలమర్రికి చెందిన బీసీ సామాజికవర్గానికి చెందిన యువతి సూర్యాపేటలో నివాసముండే దళిత సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమించి ఆరు నెలల క్రితం వివాహం చేసుకుంది. ఈ వివాహం యువతి కుటుంబ సభ్యులకు నచ్చలేదు. దీంతో గ్రామంలో తమ పరువు పోయిందని దీనికి ప్రధాన కారణం యువతిని పెళ్లి చేసుకున్న యువకుడని భావించి అప్పటి నుంచి పగతో రగిలిపోయారు. ఎలాగైనా యువకుడిని అంతమొందించాలని నిర్ణయించుకుని ఈనెల 26న రాత్రి సమయంలో సూర్యాపేటలో వడ్లకొండ క్రిష్ణ అలియాస్ మాల బంటి అనే యువకుడిని యువతి కుటుంబ సభ్యులు హతమార్చారు.

ప్రేమ పెళ్లిళ్లను అంగీకరిస్తున్నది కొందరే

సమాజంలో జరిగే ప్రేమ వివాహాలను ఎవరో కొద్ది మంది మాత్రమే అంగీకరిస్తున్నారు. కులాలు వేరైనా ఆర్థికంగా బలోపేతంగా లేకున్న పిల్లలు ఇష్టపడ్డారని కొంత మంది తల్లిదండ్రులు వారి ప్రేమకు అడ్డు చెప్పడం లేదు. అవసరమైతే అవతలి వ్యక్తులను కూడా ఒప్పిస్తున్నారు. దగ్గర ఉండి ప్రేమ వివాహం కాకుండా కుదిర్చిన వివాహంలా పెళ్లి చేస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న పరువు హత్యలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరుగుతున్న పరువు హత్యలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రేమ వివాహాలు చేసుకున్న యువతీ, యువకులు భయపడుతున్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు చూసి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్న జంటలు ఆందోళన చెందుతున్నాయి. ప్రేమించి ఇష్టమైన వారిని పెళ్లి చేసుకోవడమే చేసిన నేరమా అని వారు వాపోతున్నారు. పరువు హత్యలకు సంబంధించి చట్టంలో సెక్షన్‌లు ఏవీ కూడా పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయడంలేదు. సాధారణంగా హత్య కేసుకు సంబంధించిన సెక్షన్ల కిందనే ఈ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి కేసులు కోర్టుల్లో విచారణకు వచ్చిన సందర్భాలో ఎక్కువ శాతం శిక్షలు పడకుండా రాజీ అవుతున్న ఘటనలూ ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

ప్రేమ వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించిన యువతీ, యువకుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చట్టప్రకారం మేజర్లు అయిన యువతీ, యువకులు వివాహం చేసుకోవచ్చు. వారికి రక్షణ కల్పించే విషయంలో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. తమను కాదని ప్రేమ వివాహం చేసుకున్నారని కక్ష పెంచుకోవడం సరికాదు. నేరాలకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేసి కోర్టులో శిక్షలు పడే విధంగా చర్యలు చేపడతాం.

సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట ఎస్పీ

కోర్టుకు రిమాండ్

నేరేడుగొమ్ము, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులను ఓటీపీలు అడిగి రూ.20లక్షలు స్వాహా చేసిన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి బీపీఎం రెడ్యానాయక్‌ను ఆదివారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు నేరేడుగొమ్ము ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల పుల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్యానాయక్ నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి బీపీఎంగా మూడు నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన బీపీఎం జల్సాల కోసం రైతులను నమ్మించి డబ్బులు పోస్టాఫీసు అకౌంట్‌లో పడుతాయని చెప్పి ఓటీపీలు తీసుకొని రూ.20లక్షలు స్వాహా చేశారు. దీంతో రైతులు దేవరకొండ తపాల కార్యాలయం అధికారులు, నేరేడుగొమ్ము పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపి నిందితుడు రూ.20లక్షలు డ్రా చేసినట్లుగా ఎస్ఐ సతీష్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ భాస్కరాచార్యులు మృతి



భాస్కరాచార్యులు(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ సేవా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ నల్లందిఘల్ భాస్కరాచార్యులు ఆదివారం మృతి చెందారు. ఏడాది కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డారు. యాదగిరిగుట్ట పట్టణంలో గత 20 ఏళ్లుగా పలు దినపత్రికల్లో పనిచేశారు. ఏడేళ్ల నుంచి యాదగిరిగుట్ట విలేకరిగా పనిచేసి యాదగిరిగుట్ట ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

భాస్కరాచార్యుల మృతి బాధాకరం : గోద శ్రీరాములు

భాస్కరాచార్యుల మృతి బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. భాస్కరాచార్యుల మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ భాస్కరాచార్యుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయనవెంట జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ ఉన్నారు. భాస్కర్ మృతికి దేవాలయ ప్రధానార్చకుడు నల్లందిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు సంతాపం తెలిపారు.

పంటల బీమా ఏదీ?

(5వపేజీ తరువాయి)

వ్యవసాయశాఖకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. గ్రామం యూనిట్‌గా వరి పంటకు పంటల బీమా పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. అంటే 250ఎకరాలు ఒక యూనిట్‌గా తీసుకుంటారు. ఒక చిన్న గ్రామం లేదంటే తండాలో 50 ఎకరాల నుంచి 100 ఎకరాలు వరి ఉంటే పక్క గ్రామంలో వరి సేద్యాన్ని కలిపి 250 ఎకరాలను ఒక యూనిట్‌గా చేస్తారు. పత్తిని మాత్రం మండల యూనిట్‌గా తీసుకోనున్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ప్రధాని ఫసల్ బీమా యోజనతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న పంటల బీమా అందుబాటులోకి తీసుకురావాలని కొంత మేర కసరత్తు చేసినా ఆ తరువాత దీన్ని పక్కనపెట్టింది. వాస్తవానికి గత వానాకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. టెండర్లను ఏకమొత్తంగా కాకుండా క్లస్టర్ల వారీగా పిలవాలని వ్యవసాయశాఖ నిర్ణయించినట్టు సమాచారం. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. అయితే టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే నిధులపై స్పష్టత వస్తుంది. రాష్ట్రం వాటా చెల్లించిన తరువాతే కేంద్రం వాటా జమ చేస్తుంది. ఇక పంటల గుర్తింపు, దిగుబడి లెక్కింపునకు సాంకేతికతను వినియోగించుకోనుండగా అందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. అదే సమయంలో సాంకేతికతతో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా పంటలను గుర్తించనున్నారు. పంటల బీమా అమలులోకి వస్తే పంట నష్టపోయిన రైతులకు లబ్ధి చేకూరే అవకాశాలు ఉంటాయి. కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆ వైపుగా చర్యలు కానరావడం లేదు.

త్వరలో పంటల బీమా పథకం



త్వరలోనే పంటల బీమా పథకం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు పంటల బీమా పథకంపై చర్చలు జరిపింది. అందుకు సంబంధించి కసరత్తు కూడా మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖకు మార్గదర్శకాలు వచ్చిన వెంటనే పథకం అమలు కోసం మార్గం సుగుమం కానుంది. పంటల బీమా పథకం అమలులోకి వస్తే ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం త్వరితగతిన అందుతుంది.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ

ఓ లింగ.. ఓ లింగా

» ముగిసిన లింగమంతుల జాతర తొలిఘట్టం » ఘనంగా పెద్దగట్టు దిష్టిపూజ మహోత్సవం

» భారీగా హాజరైన యాదవ భక్తులు » డప్పు, భేరీ చప్పుళ్లు, గజ్జెల లాగులు, ఓ లింగా నామస్మరణం



సూర్యాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే పెద్ద(గొల్ల)గట్టు లింగమంతులస్వామి జాతర తొలి ఘట్టం ముగిసింది. జాతరకు ముందు నిర్వహించే దిష్టిపూజ మహోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి గంటలకు యాదవులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.. కేసారం గ్రామం నుంచి అందెనపు సౌడమ్మ దేవరపెట్టెను పాదయాత్రలో ఆలయంలోకి తీసుకు వచ్చారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓ లింగా..ఓలింగా అంటూ బేరీలు మోగిస్తూ గజ్జెలు ధరించిన దుస్తులతో నృత్యాలు చేస్తూ లింగమంతుల స్వామిని స్మరించుకున్నారు. గుట్టపైకి తీసుకువచ్చిన దేవరపెట్టెక యాదవ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గర్భగుడి ఎదుట చంద్రపట్నం వేసి బైకాన్‌లతో కలిసి యాదవ పూజారులు జాతరకు వచ్చిన భక్తులకు లింగమంతులస్వామి, సౌడమ్మల కథలు చెప్పారు. తల్లి, పిల్ల గొర్రెలను బలి ఇచ్చారు. నైవేద్యాన్ని వడ్డించి గుట్టపైన యాదవ పూజారులతో పూజలు చేసి గుట్ట చుట్టూ చల్లారు. ఈ సందర్భంగా గుట్టపై బలి చల్లేటప్పుడు బలి అందుకోవడానికి యాదవులు పోటీ పడ్డారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సూర్యాపేట డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుల్, హోంగార్డులు మొత్తం 200 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. బలి అందుకోవడానికి భక్తులు ఒక్కసారిగా భక్తులు ఎగబడటంతో వారిని ఆపడం పోలీసులకు కష్ట సాధ్యమైంది. ఓ లింగా ..నామస్మరణంతో గుట్ట పరిసరాలు మార్మోగాయి. అనంతరం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శోభయమానంగా రామలింగేశ్వర
స్వామి నగరోత్సవం





● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా వైభవోపేతంగా నిర్వహించే నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం బ్రహోత్సవాల ప్రారంభం సందర్భంగా అనవాయితీగా ఆదివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన రామలింగేశ్వర స్వామి నగరోత్సవ ఉత్సవం శోభయమానంగా సాగింది. రామగిరిలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో రథాన్ని అలంకరించి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి దేవస్థానం ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు చేసి భక్తులు హర్షధ్వనాల మధ్య నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, దేవస్థానం ఈవో ఎస్. నవీన్‌లు కొబ్బరి కాయలను సమర్పించి రథోత్సవ ఊరేగింపును ప్రారంభించారు, అక్కడి నుంచి మొదలైన ఊరేగింపు ఫ్లడ్‌లైట్ల మధ్య పట్టణంలోని పురవీదులైన రామగిరి, శివాజీనగర్, ఎన్‌టీఆర్ విగ్రహం, వివేకానంద విగ్రహం మీదుగా చెర్వుగట్టు వరకు కన్నుల పండువగా సాగింది. అడుగడునా భక్తులు స్వామివారిని దర్శించుకోని పరవశించి పోయ్యారు. రథోత్సవం ముందు మహిళ కోలాటప్రదర్శనలు, వేషధారణలు, చిన్నారుల నృత్యాలు, చెక్క భజనలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం మహిళలతో కలిసి రామాలయంలో భజనలు చేస్తూ ఉత్సాహ పరిచారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ పర్యవేక్షకురాలు సుమతి, చెరువ్వుగట్టు దేవస్థానం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



యాదగిరికొండపై భక్తుల రద్దీ



ప్రధానాలయంలోని క్యూలైన్‌లో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనార్థం వచ్చిన ఆదివారం భక్తులతో యాదగిరి కొండపై రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలి వచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్త జనుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. అలాగే భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 45,73,274 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవోఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా శ్రీ చక్ర డాన్స్ అకాడమీ (ఈసీఐఎల్) నలినీ రమణ బృందం కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయం భువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ వైభవ ంగా చేపట్టారు.

4 నుంచి రథసప్తమి వేడుకలు

రథసప్తమి సందర్భంగా ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ప్రత్యేక అలంకరణలో మంగళ వారం ఉదయం 8గంటలకు తిరుమాడ వీధుల్లో ఊరేగింపు సేవ చేపట్టి తూర్పు రాజగోపురం వద్ద చతుర్వేద పారాయణం, రథసప్తమి విశిష్టత పండితులు భక్తులకు వివరిస్తారు. రాత్రి 7గంటలకు స్వామివారిని బంగారు రథంపై ఆలయ అంతః ప్రాకారంలో ఊరేగిస్తారు. ఈ వేడుకల సందర్భంగా స్వర్ణపుష్పార్చన రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

నేటి నుంచి పాతగుట్టలో అధ్యయనోత్సవాలు



భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాతగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో సోమవారం నుంచి వార్షిక అధ్య యనోత్సవాలు, ఈ నెల 7 నుంచి బ్రహ్మో త్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థానం తగినన్ని ఏర్పాట్లు చేస్తుండగా వార్షిక బ్రహ్మోత్సవాలకు నాలుగు రోజుల ముందు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయం. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆళ్వార్లు, స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి దివ్య ప్రబంధ వేదపఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగిస్తారు. శ్రీవైష్ణవ ఆలయాల్లో ఆలయ ప్రాశస్త్యం మరింత ఇనుమడింపజేసేందుకు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆచారం. తొలి రోజు దేవతల సేనా నాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో అధ్యయనోత్సవాలను ఆరంభిస్తారు. నమ్మాళ్వార్ రచించిన దివ్యప్రబంధ వేద పఠనాలతో కొనసాగే అధ్యయనోత్సవాలు చివరి రోజునా నమ్మాళ్వారు పరమపదోత్సఘట్టాలతో ముగుస్తాయి. అధ్యయ నోత్సవాలు ముగిసిన మరుసటి రోజు నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ప్రారం భిస్తారు. పూర్వగిరి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు కుటుంబసమేతంగా తరలివస్తారు.

కైంకర్యాల రద్దు

ఆలయ ప్రాగంణంలో భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు వేశారు. ఆలయం, గోపురాలు, కల్యాణమండపానికి రంగులు వేస్తున్నారు. క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుల కోసం ప్రసాదాలు సిద్ధం చేశారు. పుష్కరిణీ పరిసరాలు శుభ్రం చేయించడమే కాక ఆలయ ప్రాంగణం, తిరువీధుల్లో పారిశుధ్యం చేపట్టారు. వార్షిక అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిత్య, శాశ్వత కల్యాణోత్సవాలు, అర్చనలు, అష్టోత్తరశతనామార్చనలు, భోగాలు, అభిషేకం రద్దుపర్చినట్లు, శతఘటాభిషేక పూజల్లో పాల్గొను భక్తులు మాత్రం ఇద్దరు ప్రవేశించేందుకు రూ.250 చెల్లించాలని ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

అధ్యయనోత్సవాలు ఇలా..

తేదీ	ఉదయం	సాయంత్రం
3న	తిరుమంజనం	తొళక్కం
4న	పురప్పాట్లు సేవ, తిరుమంజనం దివ్యప్రబంధ సేవాకాలం	పొరప్పాట్లు సేవ దివ్యప్రబంధ కాలం
5న	పొరప్పాట్లు సేవ, తిరుమంజనం దివ్యప్రబంధ సేవాకాలం	పొరప్పాట్లు సేవ, దివ్యప్రబంధ సేవ కాలం నమ్మాళ్లార్ పరమపదోత్సవం
6న	పొరప్పాట్లు సేవ, శ్రీరామానుజచార్య తిరమంజనం, మాత్తందాది శాత్తుమొర్రై	

వార్షిక బ్రహ్మోత్సవాలు ఇలా..

తేదీ	ఉదయం	సాయంత్రం
7న	10గంటలకు స్వస్తివాచనం, విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, రక్షాబంధనం	5గంటలకు అంకురార్పణ మృత్యంగ్రహణం
8న	10గంటలకు ధ్వజరోహణం, అగ్ని ప్రతిష్ట మూల మంత్ర హవనం, వేదపారాయణాలు	6గంటలకు భేరీపూజ దేవతాహ్వానం
9న	9గంటలకు హవనం 11.30గంటలకు సింహవాహన అలంకార సేవ	6గంటలకు హవనం 7.30గంటలకు అశ్వవాహన అలంకార సేవ, ఎదులు ఉత్సవం
10న	9గంటలకు హవనం 9.30గంటలకు తిరుమంజన ఉత్సవం 10.30గంటలకు హనుమంత అలంకార సేవ	6గంటలకు హోమం 7.30గంటలకు గజవాహన అలంకార సేవ తిరు కల్యాణోత్సవం
11న	9గంటలకు హవనం 11.30గంటలకు గరుడ వాహన అలంకార సేవ	5గంటలకు రథాంగహోమం 8గంటలకు దివ్య విమాన రథోత్సవం
12న	10.30గంటలకు మహాపూర్ణాహుతి 12గంటలకు చక్రతీర్థం	6గంటలకు దేవతోద్వాసన పుష్పయాగం, డోలోత్సవం
13న	ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, మహదాశీర్వచనం, పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి	

సంక్షేమానికి నిధులు కేటాయించాలి

● వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహా

భువనగిరి గంజ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే అన్ని రంగాలకు నిధుల జీవన విధానాన్ని దెబ్బతీసిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో బడ్జెట్ ప్రతులను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 50,65,345 లక్షల కోట్ల బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు, కార్మి కులు, కర్షకులు, వ్యవ సాయ కూలీలు, మహిళలు, వృత్తిదారులకు, విద్యకు, వైద్యానికి సంక్షేమానికి రాయితీలను తగ్గించి బడా కార్పొరేట్లకు రాయితీలను ఇచ్చిందన్నారు. గతేడాది కేటాయించిన రూ. 86వేల కోట్లను మాత్రమే బడ్జెట్లో చూపిందని, ఆహార భద్రతకు పెద్ద ఎత్తున కోత విధించిందన్నారు. బడ్జెట్లో రూ.2.75 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో రూ.2.4కోట్లకు కుదించిందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు ఇళ్ల నిర్మాణం చేయడానికి గత బడ్జెట్లో రూ. 54,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 32,486 కోట్లకు కుదించిందని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కేటాయింపులకు సంక్షేమ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సామాజిక పింఛన్లు అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు కేటాయింపు వాటి ఊసే లేదని, గ్రామీణ రోడ్లు, తాగు సరఫరాకు గత బడ్జెట్లో రూ. 70వేల కోట్లు కేటాయించిన ఈ సారి రూ. 67వేల కోట్లకు కుదిరించదని పేర్కొ న్నారు. మరోపక్క ప్రభుత్వ భూములు అమ్మకం ద్వారా రూ. 10లక్షల కోట్లను ఆదాయం సమకూర్చుకుంటామని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. తక్షణమే ఈ ప్రతిపాదనలను వెనక్కి తీసుకొని, సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, బట్టుపల్లి అనురాధ, మద్యపురం రాజు, లావుడియా రాజు, వీర్లపల్లి ముత్యాలు, దాసారి పాండు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, పల్లెర్ల అంజయ్య, గంధమల్ల ముత్తయ్య, భాగ్య, నాగమణి, దయ్యాల మల్లేష్, మచ్చ భాస్కర్ ఉన్నారు.

బైక్ చోరీ.. దొంగకు రిమాండ్

నాగారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రానికి చెందిన ఓర్సు వెంకన్న బుల్లెట్ వాహనం 2 నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఎతుకెళ్లాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సుర్యాపేట పట్టణానికి చెందిన శ్రీమాన్‌గా పోలీసులు గుర్తించారు. ఆదివారం సుర్యాపేట తాళ్లగడ్డలో నివాసం ఉంటున్న ఇంటివద్ద అతడి దగ్గర ఉన్న బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని బైక్ యజమానికి నాగారంలో అప్పజెప్పారు. బైక్‌ను చోరీ చేసిన శ్రీమాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

పెద్దకాపర్తి అబ్బాయి.. లండన్ అమ్మాయి

● న్యూజిలాండ్‌లో లాక్‌డౌన్ సమయంలో ప్రేమ

● యువతి పోలీస్ అధికారి

● హైదరాబాద్‌లో వివాహం చేసుకున్న కందిమళ్ల రాజీవ్ రెడ్డి, లారెన్ ఫిషర్

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ ఎల్లలు దాటింది. విదేశానికి చెందిన యువతి తన పెద్దమ్మ ఇంటికి వచ్చి లాక్‌డౌన్‌లో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో వివాహం చేసుకున్నాడు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన కందిమళ్ల రాజీవ్‌రెడ్డి. వివరాల్లోకి వెళితే... పెద్దకాపర్తికి గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు, మాజీ సర్పంచ్, రామన్నపేట మాజీ సమితి ప్రెసిడెంట్ కందిమళ్ల జోగారెడ్డి కుమారుడు మహేందర్‌రెడ్డి, ప్రేమలత దంపతుల కుమారుడు రాజీవ్‌రెడ్డి ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగం కోసం పదేళ్ల క్రితం న్యూజిలాండ్ దేశానికి వెళ్లాడు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. లండన్‌లోని మాంచెస్టర్‌కు చెందిన లారెన్ ఫిషర్ న్యూజిలాండ్‌లో ఉండే తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకునేది. రాజీవ్‌రెడ్డి ఉండే నివాసం సమీపంలో లారెన్ ఫిషర్ వాళ్ల పెద్దమ్మ నివాసం ఉండేది. నాలుగేళ్ల క్రితం లాక్‌డౌన్‌లో రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్‌లకు పరిచయం ఏర్పడింది. అప్పుడప్పుడు ఆ ప్రాంతంలో వారు కలుసుకునేవారు. వారి పరిచయం ప్రేమగా మారింది. లారెన్ ఫిషర్ ఉన్నత విద్యాభ్యాసం చేసి అక్కడి పోలీస్‌శాఖలో అధికారిగా (సైకాలజీ) ఉద్యోగం చేస్తుంది. వీరి ప్రేమ నాలుగేళ్లుగా కొనసాగుతుండగా విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపినా మొదట ఒప్పుకోలేదు. ఆ తర్వాత ఇరు కుటుంబాలు సభ్యులు పెళ్లికి అంగీకరించారు. వివాహానికి లారెన్ ఫిషర్ కుటుంబ సభ్యులు లండన్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైదరాబాద్‌లోని గౌరెళ్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్‌ల వివాహం ఆదివారం హిందూ సంప్రదాయం ప్రకారం వేదమంత్రాల సాక్షిగా ఘనంగా నిర్వహించారు. వివాహానికి ఇరు కుటుంబాలు, బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తమ కుమార్తెను సంప్రదాయాలకు అత్యంత గౌరవం, విలువనిచ్చే తెలుగింటికి పంపడం చెప్పలేని సంతోషాన్ని కలిగించిందని లారెన్ ఫిషర్ తల్లిదండ్రులు కె. ఫిషర్, డేవ్‌ఫిషర్ అన్నారు.



చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి, ప్రేమలతతో వధూవరులు రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్

2వేల వాసవీ క్లబ్‌లతో రూ.100కోట్ల సేవా కార్యక్రమాలు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పాండురంగయ్య

నేరేడుచర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ అంతర్జాతీయంగా ఈ సంవత్సరం 2వేల క్లబ్బులతో 100 కోట్ల రూపాయల మేర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్టిపుల్ దొంతు పాండురంగయ్య తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో జరిగిన వాసవిక్లబ్ ఆఫీస్ బేరర్ల ట్రైనింగ్ సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాసవి క్లబ్ 31 సూర్యాపేట జిల్లాలో 2 వేల క్లబ్బులలో ఒక లక్ష సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు ప్రతి ఒక్కరూ రోజుకు ఒక మొక్క చొప్పున 100 మొక్కలు నాటాలని, కవల పిల్లల సమ్మేళనం, బాలికలకు వేయి సైకిళ్లను పంపిణీ చేయాలని, రెండు లక్షల నోటు పుస్తకాలు పంపిణీ చేయాలని, కవాసవీక్లబ్ ఆవిర్భావ దినోత్సవమైన అక్టోబరు ఒకటో తేదీన వాసవి లోగోతో లక్ష బెలూన్ల ప్రదర్శన కార్యక్రమాలుచేపట్టనున్నట్లు తెలిపారు. వాసవి క్లబ్ అధ్యక్షులు, సభ్యులు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మీ, కార్యదర్శి బిక్కుమళ్ల కృష్ణ, కోశాధికారి వెంపటి శబరీనాథ్, రుద్రంగి రవి, శశి, బండారు వెంకటేశ్వర్లు, రాము, సతీష్, ఈగ శ్రీనివాసరావు, వీరవెల్లి శ్రీలత, సుమంత్, అరుణకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



నేరేడుచర్లలో మాట్లాడుతున్న పాండురంగయ్య

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికైనట్లు కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అదిలాబాద్‌లో జరిగే 71వ తెలంగాణ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

ఎంపికైన కబడ్డీ జట్టు: కే. కోటేష్(తుంగతుర్తి) కెప్టెన్, డి. సాయికిరణ్ (తుంగతుర్తి), ఎన్ లక్ష్మణ్ (ఆలగడప), జే. రాజశేఖర్(దేవత్‌పల్లి), జి.లోకేష్ (అనుముల), బి. కళాచారి (భీమనపల్లి), ఆర్. భరత్(గన్నెకుంట), ఆర్.ఆశోక్(బానితండా), పి. ఉదయ్ (తుర్కోనిబావి), జి. వేణు(దామరచర్ల), సీహెచ్. వినయ్‌కుమార్ (తిరుమలగిరి), శరత్(పాల్వాయి), టి. ఉదయరాజు(మధారిగూడెం) ఎంపికయ్యారు. కోచ్‌గా కృష్ణారెడ్డి(బోయగూడెం), మేనేజర్‌గా శ్రీను(బెజ్జికల్) వ్యవహరిస్తారని తెలిపారు.

సాంకేతిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మీ తెలిపారు. మూడున్నర నెలల కాలపరిమితి గల అకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీ కోర్సుకు బీకామ్ పాస్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్ పాస్, ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ రిపేర్ కోర్సుకు పదో తరగతి పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

చేతి రాతతో మంచి మార్కులు




- రైటింగ్ బాగుంటే మనవెంటే మార్కులు
- అందమైన రాతతో అధిక మార్కులు
- ప్రాక్టీస్‌తోనే అందమైన చేతిరాత

పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఎంత చదివామన్నది ఎంత ముఖ్యమో ఎలా రాశామన్నది కూడా అంతే ముఖ్యం. అయితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి మన చేతిరాత ఎలా ఉందనేది కూడా ఆలోచించుకోవాలి. చేతి రాతను బట్టి ఎక్కువ మార్కులు పొందవచ్చని రాత విశ్లేషకులు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, కనగల్)

రోళ్లపైన అక్షరాలు నెక్కిన రాతియుగం నుంచి పేపర్‌పై పెన్నుతో అక్షరాలు రాసే నేటి కంప్యూటర్ యుగం దాకా చేతిరాత ఎన్నో మలుపులు తిరుగుతూ వస్తోంది. ప్రపంచంలో ఏ ఇద్దరి చేతిరాత ఒకేలా ఉండదు. రాయడంలో ఎవరి శైలి వారిది. అక్షరాలను ముత్యాల్లా రేసేవారు కొందరైతే మరికొందరు కొంగలు తొక్కిన రీతిలో గజిబిజిగా రాస్తారు. నా రాత నా ఇష్టం అనుకోకుండా చక్కటి రాతతో మంచి మార్కులు సాధించాలి. అందమైన రాత ఉంటే మంచి భవిష్యత్తును పొందుతారు. రాతను బట్టి వ్యక్తి గుణగణాలను అంచనా వేయవచ్చని గ్రాఫాలజిస్టుల అభిప్రాయం. చిన్నవయస్సు నుండే అక్షరాలను గుండ్రంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి. బ్రహ్మ రాసిన నుదుటి రాతను చేతిరాత ద్వారా కొంతవరకైన మార్చుకోవచ్చు. పరీక్షల్లో అందమైన చేతిరాతతో జవాబులు రాస్తే 10 నుంచి 15 శాతం మార్కులు అదనంగా స్కోర్ చేయవచ్చు.

మార్చి నెలలో వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని చినమాదారం గ్రామ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థుల చేతిరాతను మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసుల్లో విద్యార్థులతో రాత ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ప్రతీ రోజు క్రమం తప్పకుండా కొంత సమయాన్ని చేతిరాత కోసం కేటాయిస్తున్నారు. అవసరమైన మెళకువలను అందజేస్తున్నారు. పరీక్షల్లో జవాబులు ఎలా రాయాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



చక్కటి చేతిరాతతో ఎక్కువ మార్కులు



పరీక్షల్లోనే కాదు భవిష్యత్‌లో ఎక్కడైనా, ఎప్పుడైనా చక్కటి చేతిరాత ఎంతో అవసరం. శాస్త్ర సాంకేతిక పెరిగినా చేతిరాతకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గలేదు. విద్యార్థులకు మంచి రైటింగ్ ఉంటే ఎక్కువ మార్కులు సాధించి మంచి గ్రేడ్‌ను సాధిస్తారు. మారిన పరీక్ష విధానం ప్రకారం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో సింగిల్ పేపర్ విధానంలో 11 పేపర్లకు గాను 7 పేపర్లు ఉంటాయి. ప్రతి విద్యార్థి రాతపై తగు శ్రద్ధపెట్టి ప్రాక్టీస్ చేయాలి. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పరీక్షలు రాసి మంచి ఫలితాలు పొందవచ్చును.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయుడు, చినమాదారం హైస్కూల్ టీచర్, చేతిరాత నిపుణుడు

రాసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి

- పెన్ను కానీ, పెన్సిల్ కానీ పట్టుకునే విధానం తగిన విధంగా ఉండాలి.
- పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగిన స్థలం వదలాలి.
- అక్షరాల సైజు ఒకే తీరుగా ఉండాలి.
- బాష దోషాలు లేకుండా చూడాలి.
- గొలుసుకట్టు రాత రాయకూడదు.
- చేతిరాత వేగంగా రాసేలా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రారంభం నుంచి చివరి లైన్‌దాకా ఒకే విధంగా ఉండేటట్టు తగిన ఓపికతో రాయాలి.

పరీక్షలు రాసేటప్పుడు ఇవి పాటించండి

- పరీక్షలో జవాబు పత్రాలు ఇవ్వగానే స్కేల్ సహాయంతో తగిన మార్జిన్ కొట్టాలి
- జవాబు పత్రంపై మరీ ఎక్కువ లైనులు కాకుండా మరీ తక్కువ కాకుండా పేజీకి 16నుంచి 18లైన్లకు మించకుండా రాయాలి.
- ఆన్సర్‌షీట్‌పై ప్రతి వాక్యం స్ట్రైట్‌గా ఉండేటట్టు రాయాలి.
- ముఖ్యమైన అంశాలు కింద గీత ఉండేటట్టు చూడాలి
- విరామ చిహ్నాలు పాటిస్తూ రాయాలి.
- తెలుగులో ఉండే అక్షరాలు గుండ్రంగా ఉండేటట్టు రాయాలి.
- తెలుగులో తలకట్టు, దీర్ఘాలు, ఒత్తులు స్పష్టంగా కనబడేటట్టు అక్షరాల తలలపై ఉండాలి స్పెల్లింగ్ మిస్టేక్ లేకుండా చూడాలి.
- పెద్ద, చిన్న అక్షరాల వ్యత్యాసం గమనిస్తూ రాయాలి.
- పరీక్షల్లో ఎట్టి పరిస్థితిలోనూ రెడ్ పెన్ను వాడకూడదు. బ్లూ లేదా బ్లాక్ పెన్ మాత్రమే వాడాలి.

నేటి ప్రజావాణి రద్దు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడమే కాకుండా తదుపరి ఎన్నికల పూర్తయ్యేంత వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరగదని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ప్రజావాణికి ఎవరూ రావద్దని తెలిపారు. ఎన్నికల అనంతరం యధావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 3 గంటల పాటు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో స్పాండ్లే కింద 33 కేవీ ఫీడర్ వేసే నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గోపలాయపల్లి, వట్టిమర్తి, నార్కట్‌పల్లి మరియు చిట్యాల పారిశ్రామికవాడల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి, గణేష్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని రిటైర్ ఉద్యోగ ఉపాధ్యాయుల నిలిగిరి రామకృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి కట్టబత్తుల గణేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాది కాలంగా నిధులు విడుదల కాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. రిటైర్ అయిన ప్రతి ఉపాధ్యాయ, ఆధ్యాపకులకు రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. తమకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కె.వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ముస్తఫా, అలీఖాన్, ఇంద్రాసేనారెడ్డి, ప్రతాపరెడ్డి, వందనం వెంకటరెడ్డి, ముజాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ శ్రేణులు నడుమ ఆయన కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డితో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకుల కార్యకర్తలంతా పూలబొకేలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ తాజా మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగట్టె లింగస్వామిగౌడ్, గుండబోయిన వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండబోయిన మల్లయ్యయాదవ్, వందిని మధు, శేఖర్ రెడ్డి, సర్వయ్యగౌడ్, నల్ల శ్రీను, రామకృష్ణారెడ్డి, రిజ్వాన్, నాగరాజు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని నల్లగొండ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కోట కరుణాకర్ సూచించారు. యూత్ ఫర్ సేవ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ జూనియర్ కళాశాలలో పాఠశాల విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు తమకు ప్రావీణ్యం ఉన్న క్రీడాంశాల్లో ప్రోత్సాహం అందించాలని సూచించారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ వాడకం, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పెరిగిన టెక్నాలజీతో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలి



చిట్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్లు

చిట్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా హౌజ్ వైరింగ్, ప్లంబింగ్ ధరలు పెంచాలని సీఐటీయూ జిల్లా సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. ధరలు పెంచాలని ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల టూల్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు ఆదివారం చిట్యాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అందుకు అనుగుణంగా ఎలక్ట్రీషియన్స్, ప్లంబింగ్ పనుల రేట్లను పెంచి భవన నిర్మాణ యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ ఉపాధ్యక్షుడు కంబంపాటి నర్సింహ, మండల అధ్యక్షుడు బరాల స్వామి, సభ్యులు ఆయూరి సత్తయ్య, బెల్లె యాదయ్య, తాడూరి చంద్రం, నీలకంఠం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండలి చైర్మన్ గుత్తా జన్మదిన వేడుకలు



గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పుట్టిన రోజును పురస్కరించుకొని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుబ్బ అశోక్‌సుందర్, ముక్కెర్ల శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, మునాసు వెంకన్న, పెరిక ఉమామహేశ్వర్, హరికృష్ణ, చిలకరాజు శ్రీనివాస్, మోష, గుండె రవి, మల్లయ్య, మైనారిటీ లీడర్ హమ్స్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ముర‌ళి, ఇతర కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరమూర్తి, వార్డెన్ల సంఘం మాజీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, దశరథరెడ్డి, గోపాల్‌రెడ్డి, అమరేందర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గుత్తా యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో పూజలు చేసిన అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి, గుత్తా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, పోతల దేవదాస్, జడల చినమల్లయ్య, అంజనేయులు, మాదవరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి స్వగ్రామంలో కేకును కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్ధన్, లింగయ్య, శ్రీను, దినేష్, రమేష్, రవీందర్‌రెడ్డి, గోపాల్, శ్రీను, స్వామి, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన వారు పలువురు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. చైర్మన్‌తో కేకును కట్ చేయించి జన్మదిన సంబురాలను నిర్వహించారు. ఆయనకు కేకును తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌ను సన్మానించిన వారిలో సుంకరి వెంకన్నగౌడ్, క్రాంతిగౌడ్, ఉయ్యాల నరేష్‌గౌడ్, సుంకరి కిరణ్, ఉపేందర్, ఆయితరాజు సాయి, ప్రభాకర్, సాయి, మధు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో సుఖేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉరుమడ్ల గ్రామస్థులు

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలి



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండటౌన్, చిట్యాల, కనగల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలని మాదిగ జేఏసీ చైర్మన్ కత్తుల జగన్, రాష్ట్ర నాయకులు పెరిక కరణ్ జయరాజ్, కత్తుల తులసీదాస్ మాదిగ డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలో లక్ష డప్పులు వేల గొంతుకలు ప్రదర్శన, ర్యాలీకి మద్దతుగా ఆదివారం మహాప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న తేదీన నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతుకలు ప్రదర్శన, ర్యాలీకి, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రతి వ్యక్తి డప్పుతో వచ్చి రాజధాని గడ్డ మీద దరువేసి మోగించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉప కులాలకు విముక్తి లభిస్తుందని అన్నారు. ఇప్పటికే చాలా నష్టపోయామని, ఇంకా ఆలస్యం చేయకుండా సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. కొంతమంది స్వార్థపరులైన మాలల ఒత్తిడికి రేవంత్ ప్రభుత్వం తలొగ్గి మాదిగ, మాదిగ ఉప కులాలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. సీనియర్ నాయకుడు కత్తుల తులసీదాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ ఖమ్ము సాయికృష్ణ, సందీప్‌గౌడ్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తుల ఎల్లయ్య, కత్తుల సైదులు, కత్తుల రాంబాబు, పేర్ల కృష్ణయ్య, కత్తుల పుల్లారంనం, కత్తుల రాజార్కం, తొలకొప్పుల గిరి, నగేష్, సన్నీ, స్వామి, లింగస్వామి, రవి, తిరుపతయ్య, వెంకట్, యల్లయ్య, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, పాల కృష్ణ, పోకల రమేష్, పెరిక నర్సింహ, రుద్రవరం దశరథ తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లో మండల కేంద్రంలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో వందల డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వర్గీకరణను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు జగన్, జయరాజ్, అంజయ్య, శంకర్, శ్రీను, నాగరాజు, రవి, రాజు, వెంకన్న, వెంకటేశ్వర్లు, అనిల్, నర్సింహ, నాగరాజు, రవి, సైదులు, శ్రవణ్, సందీప్, శంకర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నార్కట్‌పల్లి: ఫిజికల్ సైన్స్ (భౌతికశాస్త్రం)కు సంబంధించి నిర్వహించిన మండల స్థాయి ప్రతిభా పరీక్షలో తమ పాఠశాల విద్యార్థి హరిదీప్ మండల స్థాయి ప్రథమ ర్యాంకులో నిలిచాడని ఆ పాఠశాల హెచ్ఎం హిమజ తెలిపారు. హరిదీప్‌ను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

చందూరు రూరల్: చందూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సావిత్రీబాయి పూలే గ్రంథాలయానికి జూనియర్ లెక్చరర్ శివకోటితో పాటు విశ్రాంత ప్రిన్సిపాల్ డీఎస్ రాజశేఖర్ నేత్ కెమెరాలు, మహబూబ్‌నగర్‌కు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డీఎస్ హన్మా విజయలక్ష్మి కంప్యూటర్‌ను బహూకరించారు. ఆదివారం గ్రామానికి చెందిన ముక్కాముల మంజుల గ్రంథాలయానికి బీరువాలను అందజేశారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన భారుగు నాగరాజును ఆర్యవైశ్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. ఆర్యవైశ్య పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ ఆయన్ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు.

మర్రిగూడ: మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన మంగళిగిరి బాలాజీ కొంతకాలంగా తన రెండు కాళ్లు పని చేయక పోవడంతో ఇటీవల హైదరాబాద్ ఆస్పత్రిలో చేరారు. వైద్యానికి రూ.1.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలాజీ పరిస్థితిని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ. 1.25 లక్షల ఎల్ఓసీని మంజూరు చేశారు.

మర్రిగూడ: పేదలను నిండా ముంచిన కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం కేంద్ర బడ్జెట్ కాపీలను దహనం చేసి మాట్లాడారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లే బడ్జెట్‌లా ఉందన్నారు. విద్య, వైద్యాన్ని విస్మరించారని తెలిపారు. బీహార్‌కు సంబంధించిన బడ్జెట్‌లా ఉందని విమర్శించారు.

మర్రిగూడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. నామాపురం, అంతంపేట ఎంపీటీసీ స్థానాల కోసం సమావేశం నిర్వహించారు. గతంలో లెంకలపల్లి, మేటిచందాపురం, కొట్టాల, ఇందుర్తి, సరంపేట గ్రామాలు నుండి ఒక ఎంపీటీసీ స్థానం ఉండేది. నామాపురం, గట్టుప్పల్ మండలానికి నూతనమండలంగా కావడం వల్ల మేటిచందాపురం, కొట్టాల, ఇందుర్తి, సరంపేట గ్రామాలను కలుపుకొని సరంపేట గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, నాయకులు సిలివేరు వెంకటేష్ పాల్గొన్నారు.

నల్లగొండ: కేంద్రప్రభుత్వం 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పింఛన్‌దారులకు రూ.12.75లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయించడంపై ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలూకా శాఖ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రికి, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు గువలెల్లి నర్సింహ, యాదవ సుదేవ్, సంఘం నాయకులు డి.మోహన్‌రావు, రామలింగం, గుండగోని లింగయ్యగౌడ్, సుధాకర్, రమేష్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: పార్లమెంటులో నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రైల్వేరంగంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఎంసీపీఐ విజ్ఞాన కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి నర్సింహ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రవేశపెట్టిన ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను, కేంద్ర బడ్జెట్‌లో కూడా జిల్లాకు కేటాయింపు చేయాలని అన్నారు.

మిర్యాలగూడ టౌన్: జర్నలిస్టులందరికీ హెల్త్‌కార్డులు అందజేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేసే జర్నలిస్టులు నిత్యం ఒత్తిడి, సవాళ్లను ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు.

పెట్టుబడిదారులు, ఉన్నతవర్గాలకు అనుకూల బడ్జెట్

● అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న

శాలిగౌరారం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెట్టుబడిదారులు, ఉన్నత వర్గాలకు అనుకూలంగా ఉందని, పేద, మధ్యతరగతి ప్రజలకు, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న అన్నారు. శాలిగౌరారంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసం సవరించే చర్యలు చేపట్టలేదన్నారు. దేశ సంపదను అంతా కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతూ బడ్జెట్‌లో కూడా వారికి పెద్దపీట వేశారని విమర్శించారు. ఈ విధానాన్ని వెంటనే నిలిపివేసి బడ్జెట్ వర్గాలు శ్రామిక వర్గాలకు మేలు చేసే రకంగా ఉండేలా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య అన్నారు. చిట్యాలలో ఆదివారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి మిగతా రాష్ట్రాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిట్ట సరోజ, చిత్తగోని నర్సింహ, లడే రాములు, గుడిసె లక్ష్మీనారాయణ, మాదరబోయిన వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ సమస్యపై అఖిలపక్షం ఏర్పాటు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలో అసంపూర్తిగా ఆగిన రోడ్డు విస్తరణ పనుల సమస్య పరిష్కారానికి పోరాటం చేసేందుకు ఆదివారం అఖిలపక్షం ఏర్పాటైంది. రోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా పూర్తికావడం లేదు. దీంతో వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించి అఖిలపక్షంగా ఏర్పడ్డారు. ఇందులో కాంగ్రెస్ మినహా అన్ని పార్టీల సభ్యులు ఇందులో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి చిరుమర్తి యాదయ్య, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక శ్రీధర్, సీపీఎం నుంచి చింతపల్లి బయన్న, ఈమనగంటి అయిలయ్య, కొప్పు శ్రవణ్, సీపీఐ నుంచి పెంద్యాల శంకరయ్య, వెంపటి శ్రీను, శ్రీపతి స్వామి, బీజేపీ నుంచి కర్నాటి శంకర్, నడింపల్లి శ్రవణ్, నోముల రాజు, టీడీపీ నుంచి బింగాల యాదయ్య, చెన్నారపు సత్తయ్య, చింతలక్ష్మణ్, నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి నుంచి కన్వీనర్‌గా సర్సింహ, గూడూరు అంజిరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడ్డారు.

మంద కృష్ణమాదిగను కలిసిన ప్రియదర్శిని



మంద కృష్ణమాదిగను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మేడి ప్రియదర్శిని

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి ప్రియదర్శిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగను ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. కేంద్రప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించినందుకు ప్రియదర్శిని మంద కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నందుకు తన అండగా ఉంటానని తెలిపారు.

స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ గిరి



అభివాదం చేస్తున్న స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి

రామగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ గిరి ఎన్నిక య్యారు. జిల్లా కేంద్రంలోని స్థానిక విశ్వబ్రాహ్మణ వసతిగృహంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంజమూరి రామాచారి, ప్రధాన కార్యదర్శి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ గిరి, ప్రధాన కార్యదర్శిగా ఐసుగిరి గోపి మనోహరాచారి ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కస్తూరి సత్యనారాయణ చారి, గోట్టిముక్కల చంద్రశేఖర్, కొల్లోజు సత్యనారాయణ చారి, కూరెల్ల మదనాచారి పాల్గొన్నారు.

భక్త మార్కండేశ్వరస్వామి దేవస్థాన నూతన కమిటీ

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలివెల శ్రీభక్త మార్కండేయ సహిత భవాని శంకరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ ఛైర్మన్‌గా బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా బడుగు సత్తయ్య, కార్యదర్శి మేకల గోపాల్, కోశాధికారి పున్న శ్రీనివాస్, సభ్యులుగా రాపోలు మురళి, సత్యనారాయణ, గంధారి కృష్ణయ్య, చెరుకు శంకర్, వెంకటేశ్వర్లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఆలయ బ్రహ్మోత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు బిక్షపతి తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.140	194	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 17.0

● వైభవంగా దిష్టిపూజ



సూర్యాపేట జిల్లా కేసారం నుంచి సౌడమ్మ దేవరపెట్టెను పెద్దగట్టుకు తరలిస్తున్న యాదవులు

● అట్టహాసంగా నగరోత్సవం



చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లగొండలో నగరోత్సవంలో మహిళల కోలాటం

●5లో..

ప్రేమ పెళ్లిళ్లపై పరువు కత్తి

- అడ్డుపడుతున్న కులం, మతం, ఆర్థిక స్థోమతలు
- అంగీకరించని తల్లిదండ్రులు
- కక్ష పెంచుకొని హత మారుస్తున్న వైనం
- ఆందోళన కలిగిస్తున్న పరువు హత్యలు



ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీతో పరుగులు పెడుతున్నా సమాజంలోని కుల, మత, ఆర్థిక అంతరాలు మాత్రం తొలగడం లేదు. యువతీ యువకుల మధ్య చిగురిస్తున్న ప్రేమలకు ఇవి అడ్డుగోడగా నిలుస్తున్నాయి. పరువు పేరుతో ప్రేమ వివాహాలను పెద్దలు అంగీకరించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం రెండు నుంచి మూడు జంటలు ప్రేమ వివాహాలు చేసుకుంటుండగా, వీటిలో పెద్దలు అంగీకరించినవి కొన్నే ఉంటున్నాయి. అంతేగాక ప్రేమ పేరుతో కూతురిని దూరం చేశారని, సమాజంలో పరువు తీశారని తల్లిదండ్రులు కక్ష పెంచుకుంటున్నారు. ఫలితంగా పరువు హత్యలు చోటుచేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సూర్యాపేట జిల్లాలో జరిగిన ఓ యువకుడి పరువు హత్య దీనికి నిదర్శనం.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పరువు హత్యలు కొనసాగుతున్నాయి. కుమార్తె, కుమారుడు ఇష్టం లేకుండా ప్రేమ, కులాంతర వివాహం చేసుకోవడం కొంత మంది తల్లిదండ్రులకు ఇష్టం ఉండడం లేదు. వారి సామాజికవర్గంలో వివాహం చేయాలని ఆశించిన వారికి ప్రేమ వివాహాలు రుచించడం లేదు. దీంతో కోపోద్రిక్తులై ప్రేమ వివాహం చేసుకున్న వారిని అంతమొందిస్తున్నారు. మాయ మాటలు చెప్పిన యువకుడి అంతమొందిస్తే తర్వాత కుమార్తె యథావిధిగా ఇంటికి వస్తుందని వారు భావిస్తున్నారు. కొన్నాళ్ల పాటు ఘటనను మర్చిపోయగా, వారిని ఇష్టమొచ్చిన వారికి కట్టబెడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో సూర్యాపేటలో 2000లో కులాంతర వివాహం చేసుకుందని ఓ వ్యాపారి యువకుడిని హత్య చేయించాడు. 2012లో తన కుమార్తెను ప్రేమిస్తున్నాడని ఎంత చెప్పినా వినడంలేదని భావించిన వ్యక్తులు ప్రేమికుడిని హత్య చేశారు. అదే విధంగా యాదాద్రి జిల్లాలో నాలుగేళ్ల క్రితం లింగరాజుపల్లికి చెందిన తుమ్మల స్వాతి, పల్లెర్ల గ్రామానికి చెందిన నరేష్ ప్రేమించుకున్నారు. వారి ప్రేమకు కులాలు అడ్డుకావడంతో తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో స్వాతి తల్లిదండ్రులు నరేష్‌ను హత్య చేశారు. అది తట్టుకోలేక స్వాతి కూడా మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే విధంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గానుగవెల్లికి చెందిన యువకుడు పీఏపల్లి మండలం పోల్కంపల్లికి చెందిన యువతిని ప్రేమించాడు. వాళ్లిద్దరు ప్రేమ వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న యువతి తండ్రి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో పోలీసులు యువకుడి మందలించడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనను మరవకముందే మిర్యాలగూడెంలో ప్రేమ పేరుతో కులాంతర వివాహం చేసుకుందనే పగతో వ్యాపారి మారుతీరావు తన కుమార్తె అమృతను ప్రేమ వివాహం చేసుకున్న దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రణయ్‌ను హత్య చేయించాడు. తాజాగా, సూర్యాపేటలో ఓ యువకుడు పరువు హత్యకు గురయ్యాడు.

ప్రేమిస్తే విభేదిస్తున్న తల్లిదండ్రులు

మేజర్ అయిన యువతీ, యువకులు ఒకరినొకరు అర్థం చేసుకొని కలకాలం కలిసి జీవించేందుకు ప్రేమించుకుంటున్నారు. ప్రేమ అనంతరం ఒకటవుతున్నారు. కానీ, వీరి ప్రేమను తల్లిదండ్రులు విభేదిస్తున్నారు. ప్రేమలు కేవలం వ్యామోహం, ఆకర్షణలని తిరస్కరిస్తున్నారు. ప్రేమ పేరుతో వివాహాలు చేసుకున్న వారు జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన సందర్భాలు తక్కువగా ఉంటున్నాయని కొంత మంది తల్లిదండ్రులు ప్రేమ వి వాహాలను అంగీకరించడం లేదు. ప్రేమ వివాహం చేసుకుంటే చస్తామని మరి కొంత మంది తల్లిదండ్రులు బెదిరిస్తున్నారు.

పగ పెంచుకొని..

పిల్లల ప్రేమను జీర్ణించుకోలేని కొంత మంది పగతో రగిలిపోతున్నారు. ఇలాంటి తరుణంలోనే వారిని హతమార్చేందుకు వెనకాడడం లేదు. పలు సందర్భాల్లో ఇద్దరు ప్రేమికులను కూడా చంపేస్తున్నారు. కుమార్తెకు మాయమాటలు చెప్పి లొంగదీసుకొని సమాజంలో తలదించుకునేలా ప్రవర్తించాడని యువకులపై కోపం పెంచుకుంటున్నారు. దీంతో హత్యలు జరుగుతున్నాయి. తాజాగా, సూర్యాపేట మునిసిపాలిటీ...


- మిగతా 4వ పేజీలో...





అడ్డుపడుతున్న కులాలు, ఆర్థిక స్థోమతలు

ప్రేమ వివాహాలకు కులాలు, ఆర్థిక స్థోమతలు అడ్డుపడుతున్నాయి. తక్కువ, ఎక్కువ కులం అంటూ ప్రేమ వివాహాలకు పెద్దలు అంగీకరించడంలేదు. సమాజంలో పరువు పోతుందని కొంత మంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఆర్థిక స్థోమతలు కూడా అడ్డుపడుతున్నాయి. తమ స్థాయికి తగ్గ కుటుంబం కాదని విభేదిస్తున్నారు. ఇలాంటి తరుణంలోనే ప్రేమ వివాహాలు చేసుకున్న యువతీ, యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా నివాసం ఉండి జీవించలేక దూర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు.



పంటల బీమా ఏదీ?

- ఇంకా విధివిధానాలు రూపొందించని ప్రభుత్వం
- బీమా కంపెనీలతో చర్చలతోనే సరి
- పంటలు దెబ్బతింటే పరిహారం దక్కని పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటల సాగు

నల్లగొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకంపై ఒక నిర్ణయానికి రాలేక పోతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు పంటల బీమాపై విధివిధానాలను ఖరారు చేయలేదు. గత వానాకాలం సీజన్ నుంచే పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించినా, యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇది అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ సీజన్‌లో పథకం అమలు లేనట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఎంఎఫ్‌బీవైలో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఏడాదిగా ఈ పథకం అమలుకు విధి విధానాలు రూపొందించాలని ఆర్థిక..

- మిగతా 4వ పేజీలో...



బీమా కంపెనీలతో చర్చలతోనే సరి

ఉచిత పంటల బీమా పథకం అమలు కోసం బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణ కోసం రాష్ట్ర స్థాయిలో అధికారులు చర్చలతోనే సరిపెట్టారు. వ్యవసాయశాఖ ద్వారా చేపట్టే క్రాఫ్ బుకింగ్ యాప్‌లో పంటల వివరాలు నమోదయితే నష్టం జరిగినప్పుడు ఆ పంటలకు పరిహారం వస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 21.50లక్షల ఎకరాలల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పెద్ద మొత్తంలో వరి సేద్యమవుతుంది. డిండి ప్రాజెక్టుతో పాటు ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టు, యాదాద్రి జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతం వెంట వరి సేద్యమే అధికంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మెట్ట ప్రాంతాలల్లో రైతులు అత్యధికంగా పత్తికే ప్రాధాన్యం ఇస్తారు. ఎంత సాగు అయితే అంతా మేర పంటల బీమా పథకం అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని మెరుగైన విధంగా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లా వారీగా చర్చలు జరిగినా, సదస్సులు మాత్రం నిర్వహించలేదు. ఏఈఓల నుంచి మొదలు ఏఓలు, ఏడీఏలు, డీఏవోలు, సీపీవోలు ఇతర అనుబంధ శాఖల అధికారులతో సదస్సులు నిర్వహిస్తామని గతంలో ప్రకటించినా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు నిధులు కేటాయించలేదని, దీనికి బాధ్యతగా బీజేపీ మంత్రులు, ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణకు గుండుసున్నా దక్కిందన్నారు. రాష్ట్రంనుంచి బీజేపీకి ఉన్న ఇద్దరు మంత్రులు, 8మంది ఎమ్మెల్యేలు దీనికి పూర్తి బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్ డ్రీమ్ బడ్జెట్ కాదు దివాలా బడ్జెట్ అన్నారు. కేంద్రానిది ప్రజావ్యతిరేఖ బడ్జెట్ అని అది కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరేదిగా ఉందన్నారు. మధ్యతరగతి ప్రజలకు నష్టం వాటిల్లే బడ్జెట్ అన్నారు. రాష్ట్ర విభజన చట్టానికి తూట్లు పొడిచారన్నారు. దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో అన్ని సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు నిల్

(ఆంధ్రజ్యోతి, హాలియా): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక కర్షకుకు నిల్‌గా, కార్పొరేట్ సంస్థలకు ఫుల్‌గా కేటాయించి పేద బడుగు బలహీన వర్గాల పొట్టలు కొట్టి బడాబాబులకు కొమ్ముకాసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంపై 50శాతం మంది ఆధారపడి జీవిస్తుంటే కేవలం 2శాతం నిధులు మాత్రమే కేటాయించారని, కార్పొరేట్ సంస్థలకు మాత్రం 13లక్షల కోట్ల రూపాయలు రాయితీలు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యానికి కూడా నామమాత్రంగా కేటాయించారని, ధరల పెరుగుదలపై నియంత్రణ, నిరుద్యోగం తదితర అంశాలపై కేటాయింపులే లేవని అన్నారు. కార్యక్రమంలో కూన్‌రెడ్డి నాగిరెడ్డి, అవుతా సైదులు, పొదిల వెంకన్న, రెబెల్లి వెంకటేశ్వర్లు, కారంపొడి ధనమ్మ, రమేష్ పాల్గొన్నారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత

- ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు
- 900మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంతోపాటు, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో ముందస్తుగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 93 మంది ఎస్ఐలు, 186 మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 900మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు పార్కింగ్‌తో పాటు రక్షణ, భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు రోడ్డు పక్కన వాహనాలు నిలిపి భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని, వారికి కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో దొంగతనాలను నివారించే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, భక్తులు కూడా దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది కలిగినా వెంటనే పోలీస్ కంట్రోల్‌రూం, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

130 సీసీ కెమెరాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల సందర్భంగా 130 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాంరెడ్డి సూచనలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఇప్పటికే ఎస్పీ పవార్ గుట్టను సందర్శించి బందోబస్తుపై దిశానిర్దేశం చేశారని చెప్పారు. గుట్టపై స్థలాభావం ఉన్నందున ఘాట్‌రోడ్డుపై వాహనాలను అనుమతించేది లేదన్నారు. ఘాట్‌రోడ్డుపై కాలినడకన లేదా మెట్ల మార్గం ద్వారా భక్తులు గుట్టపైకి చేరుకోవచ్చన్నారు. కాలినడకన వెళ్లలేని భక్తులు దేవస్థానం, పోలీస్‌శాఖ ఏర్పాటు చేసే వాహనాల్లో వెళ్లాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌ల గస్తీతో పాటు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేవస్థానం ఆధ్వర్యంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, జాతర కోసం అదనంగా మరో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవో కార్యాలయంలో ఉండే కమాండ్ కంట్రోల్ ద్వారా వీటిని పర్యవేక్షిస్తామని తెలిపారు. మఫ్టీ సిబ్బంది నిఘా ఉంటుందన్నారు.

గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగాలని, అందుకు వారికి తగిన శిక్షణ ఇవ్వాలని అర్జున అవార్డు గ్రహీత, జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ అన్నారు. నల్లగొండకు చెందిన క్రీడాకారులు ఆదివారం గోపిచంద్‌ను హైదరాబాద్‌లోని ఆయన అకాడమిలో కలిశారు. ఖేలో ఇండియా టోర్నమెంట్‌లో అండర్-13, 15 విభాగంలో సిల్వర్ మెడల్, సీఎం కప్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతర సాధనతోనే గెలుపు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, శిక్షకుడు బండ్ల ప్రశాంశాత్‌బాబు, ఎల్లయ్య, కోచ్‌లు దాసు, సునిత, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న గోపిచంద్

బెస్తల్లో రాజకీయ చైతన్యం పెరగాలి



కేక్ కట్‌చేస్తున్న తెలంగాణ బెస్త సేవా సంఘం నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బెస్తలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని తెలంగాణ బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, వ్యవస్థాపకుడు, కవి అంబటి వెంకన్న అన్నారు. తెలంగాణ బెస్త సేవా సంఘం ఆవిర్భావం సందర్భంగా పట్టణంలోని శ్రీనగర్ గంగపుత్ర సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బెస్తలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, మత్స్య సొసైటీల్లో ఇతర కులస్థులకు చోటు ఇవ్వడం సమస్యలకు దారితీస్తోందన్నారు. రాష్ట్ర సాధనలో బెస్తలు కీలకపాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. పాఠ్యపుస్తకాల్లో చేపలు పట్టేవారు ముదిరాజ్‌లు అని తప్పుగా రాస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తూ దుర్మార్గ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. చేపలు పట్టే వృత్తి కేవలం బెస్తలదేనని, ఇతరులు కేవలం వ్యాపారం చేస్తున్నారన్నారు. తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబటి మురళీధర్, పూర్ణచందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నామం.. వినూత్నం

●4లో..

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామ యువకులు

వేములపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): యువత మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ సూచించారు. మాదకద్రవ్యాల రహిత గ్రామంగా నిలిపేందుకు కృషిచేస్తామని మండలంలోని శెట్టిపాలెంలో యువకులు ఆదివారం ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో సైతం గంజాయి, మత్తు పదార్థాలు వ్యాపించడంతో యువత వాటికి బానిసలుగా మారుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామంలోకి గంజాయి, మత్తు పదార్థాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ గోపాల్‌రావు, కట్టా వెంకటయ్య, కలుకూరి వేణు, నక్క శ్రీధర్, చంటి, వెంకన్న, విక్రమ్, రాంబాబు, సైదిరెడ్డి, రుషి, ముత్తయ్య, సాయి, సుమంత్, లక్ష్మణ్, సతీష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

'పిల్లలకు రాయడం, చదవడం నేర్పాలి'

హాలియా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాల్‌టెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి సెంటర్‌లో విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. హాలియాలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో వివిధ మండలాల అభ్యాసకులు, కోఆర్డినేటర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలాల కోఆర్డినేటర్లు రమేష్‌రెడ్డి, అంజి, రిజ్వాన్‌బాబా, నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



పూజలో పాల్గొన్న భక్తులు

హాలియా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకొని హాలియా మున్సిపాలిటీలోని న్యూకిడ్స్ పాఠశాలలో సరస్వతీ మాతకు ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో విఘ్నేశ్వర పూజ, నవగ్రహారాదణ, సరస్వతిమాతకు పంచామృతాభిషేకం చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు మనాది శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం : ఎమ్మెల్యే



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, వూరె లక్ష్మణ్, గుండ్లపల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న యాదవులు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐక్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పోటీచేసి రాజకీయంగా ఎదగాలన్నారు. యాదవుల జనాభా ధామాషా ప్రకారం రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్‌యాదవ్, నరసింహ, ఎల్లయ్య, సత్తయ్యయాదవ్, వెంకటయ్య, పరమేష్, శ్రీనివాస్, కొండల్, వెంకటయ్య, గోవింద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీ బుద్ధవనంలో పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. హాలియా పట్టణానికి చెందిన నలంద విద్యాలయం (2001-02)లో చదువుకున్న వారు 23 సంవత్సరాల తర్వాత ఒకే చోటు కలుసుకున్నారు. చాలా కాలం తర్వాత కలిసిన వారు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు జలంధర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చలమల వెంకట్‌రెడ్డి, పీఈటీ రాంబాబు, ముబీన్, ప్రదీప్, సౌమ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలి

చిట్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అ నుగుణంగా హౌజ్ వైరింగ్, ప్లంబింగ్ ధరలు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. ధరలు పెంచాలని ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల టూల్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆదివారం చిట్యాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అందుకు అనుగణంగా ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ పనుల రేట్లను పెంచి భవన నిర్మాణ యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభంపాటి నర్సింహ, మండల అధ్యక్షుడు బరాలస్వామి, అరూరి సత్తయ్య, బెల్లి యాదయ్య, చంద్రం పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



జూలకంటి సమక్షంలో సీఐటీయూలో చేరిన వివిధ కార్మిక సంఘాల నాయకులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): హక్కులు సాధించేందుకు కార్మికులు ఉద్యమించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర నాయకుడు జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి వీరారెడ్డి పిలుపునిచ్చారు. సాగర్ హిల్ కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వివిధ కార్మిక సంఘాలకు చెందిన నాట్కో, నందికొండ మునిసిపల్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక రాజ్యం రావాలన్నారు. కార్మిక సంఘాన్ని సంఘటిత పరిచి యూనియన్లను ఏర్పాటు చేస్తామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తోందన్నారు. ప్రభుత్వాలు కార్మికుల పొట్టలు కొట్టి యాజమాన్యాలకు లబ్ధి చేకూరుస్తోందన్నారు. 78 ప్రభుత్వ శాఖలను ప్రైవేటీకరించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్‌కే. బషీర్, జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదులు, చిరు నాగార్జున, మల్లయ్య, చంద్రయ్య, బత్తుల గోవిందు, ఆనంద్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

నిడమనూరు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఆదాని, అంబానీలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, రాష్ట్రానికి ఏమి సాధించని ఎంపీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమలంలో ఆ పార్టీ నాయకులు కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, చంద్రశేఖర్, కుంచం శేఖర్, వింజమూరి శివ, బాలనారాయణ, మహేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ హెల్త్‌కార్డులు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేసే జర్నలిస్టులు నిత్యం ఒత్తిడి, సవాళ్లను ఎదర్కోవాల్సి ఉంటుందన్నారు. వారికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల ఇళ్ల స్థలాల విషయమై నివేదికలు అందించినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డికి కోరినట్లు తెలిపారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శిగా కలిమెల నాగయ్యను ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా మాధురి యాదగిరి, ఉపాధ్యక్షులుగా కొన్‌రెడ్డి రాంరెడ్డి, ఏళ్ల బయన్నను నియమించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి సత్యనారాయణ, గుడుగుండ్ల సుందర్, రంగా శ్రీనివాస్, నాగాచారి, రమేష్, కిషోర్, నర్సింహ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కోరారు. మండలంలోని కన్నెకల్ గ్రామంలో గ్రామానికి చెందిన మారెపల్లి రంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోడలు డాక్టర్ మనోహరమ్మ సహకారంతో శంకర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రామస్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని పేదలకు ఉచిత కంటి వైద్య చికిత్స అందించడం అభినందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పేదలకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా చెన్నైకు తరలించిన వారి వైద్య ఖర్చులను తానే భరిస్తానన్నారు. ఆదివారం డాక్టర్లు గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 150మందికి కంటి ఆపరేషన్లు గ్రామంలోనే నిర్వహించారు. అదేవిధంగా వంద మందికి మెరుగైన కంటి వైద్యం అందించేందుకు చైన్నై ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిరెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి

నిడమనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నిడమనూరు మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి అకాల మరణం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మడం గ్రామంలో దశదిన కర్మ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తొలుత రంగశాయిరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ రంగశాయిరెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, నిత్యం ప్రజల కోసమే పని చేశాడని కొనియాడారు. ప్రజలు మంచి నాయకున్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మార్కెట్ చైర్మన్లు అంకతి సత్యం, చంద్రశేఖర్‌రెడ్డి, నందికొండ రామేశ్వరి, విక్రమ్‌రెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, పసుపులేటి సైదయ్య, మేరెడ్డి వెంకట్‌రాహుల్, నూకల వెంకట్‌రెడ్డి, శివమారయ్య, మర్ల చంద్రారెడ్డి ఉన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న యుగేందర్‌గౌడ్

దేవరకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాచాల యుగేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం దేవరకొండలో జరిగిన బీసీ పొలిటికల్ జేఏసీ యువజన విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కుల గణన చేపట్టిందని, దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నామినేటెడ్ పదవులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు పక్క ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. రాజాధికారం దిశగా బీసీలు ముందుకు వెళ్లాలని కోరారు. బీసీలను ఐక్యం చేసేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల చైతన్యయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్, తోటపల్లి మల్లేష్, నియోజకవర్గ అధ్యక్షుడు సాయిరాం, అనిల్, ధన్‌రాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం

హాలియా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్వర్యంలో హాలియా మున్సిపాలిటీలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సంఘం అధ్యక్షులు గట్టు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కేస శేఖర్ అధ్వర్యంలో ఆదివారం బహుమతులు అందజేశారు. చిందే వెంకట్, నల్లగొండ సతీష్‌కుమార్(ప్రథమ) సుగురు నారాయణ, కొండలరావు(ద్వితీయ)లకు షీల్డ్‌లు, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి దిడ్డి జగదీష్, జోన్ చైర్మన్ గందె మహేస్, వైస్ చైర్మన్ అంకిశెట్టి రమేష్, వివేకానంద యూత్ సభ్యులు తూటిపల్లి సైదులు, అంకిశెట్టి ప్రవీణ్, కృష్ణ, గౌతమ్, బిట్టు, సమీర్, జీవన్, ప్రసాద్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

నల్లగొండటౌన్, ఫిబ్రవ రి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయలకు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులు సిలిగిరి రామకృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి కట్టబత్తుల గణేష్ డిమాండ్ చే శారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాది కాలంగా నిధులు విడుదల కాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రిటైర్డ్ అయిన ప్రతి ఉపాధ్యాయ, అధ్యాపకులకు రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. తమకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కె.వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ముస్తఫా, అలీఖాన్, ఇంద్రసేనారెడ్డి, ప్రతాపరెడ్డి, వందనం వెంకట్‌రెడ్డి, ముజాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శిగా గోవర్ధనాచారి



మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఇనుగుర్తి గోవర్ధనాచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవర్ధనాచారి ఎన్నిక పట్ల విశ్వకర్మ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలమ్మ చెట్టు గ్రామానికి చెందిన కత్తి రాజశేఖర్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కూన్‌రెడ్డి మల్లారెడ్డి, పబ్బు యాదగిరిగౌడ్, చింతల చంద్రారెడ్డి, కత్తి విజయ్‌రెడ్డి, ఊరె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విశ్వాస పరిచర్య ప్రార్థన మందిర వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి చర్చి పాదర్ హన్యానాయక్ మాట్లాడుతూ మతమేదైనా ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, లోక కల్యాణార్థం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మత పెద్దలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రమాభాయి, జనార్థన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

డీటీగా బాధ్యతల స్వీకరణ

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కత్తుల సైదులు ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ శాలిగౌరారం మండలానికి బదిలీపై వెళ్లారు. తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సైదులు పదోన్నతిపై మాడ్గులపల్లి మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ సైదులును సన్మానించారు.

'అన్ని వర్గాలకు మేలు చేసే కేంద్ర బడ్జెట్'

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకూ మేలు చేసేలా ఉందని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. మండలంలోని ఈదులగూడలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. యువత, మహిళలు, రైతులకు స్వాంతన చేకూర్చడంతో పాటు మితాదాయ వర్గాలకు పన్ను మినహాయింపునివ్వడం గొప్ప విషయమన్నారు. రవాణా, వైద్య, పారిశ్రామిక రంగాలకు అండగా నిలిచేలా బడ్జెట్ రూపొందించారన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడమే కాకుండా తదుపరి ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరగదని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ప్రజావాణికి ఎవరూ రావద్దని తెలిపారు. ఎన్నికల అనంతరం యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెట్టుబడిదారులు, ఉన్నత వర్గాల అనుకూల బడ్జెట్

శాలిగౌరారం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జె ట్ పెట్టుబడిదారులు, ఉన్నత వర్గాలకు అనుకూలంగా ఉందని, పేద, మధ్య తరగతి ప్రజలకు, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న అన్నారు. శాలిగౌరారంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌ను పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసం సవరించే చర్యలు చేపట్టాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతూ బడ్జెట్‌లో కూడా వారికే పెద్దపీట వేశారన్నారు.